

■ లీడర్స్ వాయిస్

పోలీసులూ..తీరు మార్చుకోండి

వైసీపీ నేతలు ముందస్తు ప్రణాళికతోనే మా ఎన్నికల ప్రచారాన్ని అడ్డుకోవడంతో పాటు అల్లర్లకు, దాడులకు తెగబడుతున్నారు.గిరిపురంలో కూడా పోలీసుల సమక్షంలోనే కూటమి అభ్యర్థుల ప్రచారాన్ని వైసీపీ నేతలు అడ్డుకుని దాడులకు పాల్పడ్డారు.అయినా టీడీపీ, జనసేన నేతలపై కేసులు పెట్టడం పోలీసుల పక్షపాతవైఖరికి నిదర్శనం. దాడులను అడ్డుకోవాల్సిన పోలీసులే ఇలా ఏకపక్షంగా వ్యవహరించడమేంటి?మరోసారి ఇలా జరిగితే న్యాయం కోసం ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తాం. ఈసీ దృష్టికి తీసుకెళ్లి చర్యలకు పట్టుబడతాం.



- నరసింహ యాదవ్,
టీడీపీ అధ్యక్షుడు

జగన్ ఎంతకైనా తెగిస్తాడు

అధికారం కోసం రక్తసంబంధీకులనే అంతమొందించడంతో పాటు అన్న అరాచకాలను భరించలేక రోడ్లపైకి వచ్చిన సొంత చెల్లెళ్లను అసభ్యకరంగా మాట్లాడే సీఎం జగన్ అధికారంకోసం ఎంతకైనా తెగిస్తాడని ప్రజలు గ్రహించాలి.ఇచ్చిన మద్యపాన నిషేధం హామీని గాలికొదిలేసి కల్తీమద్యంతో ఎంతోమంది మృతికి కారకుడయ్యాడు జగన్.వైసీపీ ప్రభుత్వంలో ఇసుక, గంజాయి, భూ అక్రమణలు ఏ రీతిలో పెరిగాయో గుర్తించండి.కూటమి పార్టీల గెలుపుతోనే ఈ అరాచకాలు అంతమవుతాయి.



- కోడూరు బాలసుబ్రహ్మణ్యం,
టీడీపీ నేత

పుణ్యక్షేత్రాన్ని అవినీతికి అడ్డాగా మార్చేశారు

పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతిని గడిచిన ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం దోపిడీలకు, గూండాయిజానికి, అవినీతికి అడ్డాగా మార్చేసింది.ఆఖరుకు గంజాయి సేవించిన వైసీపీ అల్లరి మూకలు ఎన్నికల ప్రచారంలో ఎన్డీయే కూటమి నేతలను అడ్డుకోవడం, దాడులకు పాల్పడటం చూస్తుంటే తిరుపతిలో వైసీపీ నేతలు ఎంత దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారో అర్థమవుతోంది. ఈ సంస్కృతి మన తిరుపతికి ఎంత మాత్రం మంచిది కాదు.



- మబ్బు దేవనారాయణరెడ్డి,
టీడీపీ నేత

గంజాయికి అడ్డాగా తిరుపతి

తిరుపతి అంటే అందరికీ గుర్తొచ్చేది శ్రీవారి లడ్డూ . కానీ ఇప్పుడు తిరుపతి అంటే గంజాయికి అడ్డా అనేంత ఫేమస్ చేసిన ఘనత ఎమ్మెల్యే కరుణాకర రెడ్డి, ఆయన తనయుడు అభినయ్‌దే. రాజకీయ స్వలాభం, ఆదాయం కోసం గంజాయి వ్యాపార సామ్రాజ్యాన్ని నగరంలో విస్తరింపజేశారు. యువతను గంజాయి మత్తులోకి దించి ప్రతిపక్షాలపైకి ఆయుధాలుగా వినియోగిస్తూ అరాచకాలకు తెగబడుతున్నారు.



-ఎన్డీయే కూటమి నేతలు
అజయ్‌కుమార్, చిన్నబాబు, సుభాషిణి



బస్సుపై నుంచి ప్రసంగిస్తున్న జగన్

జగన్ నోట వినిపించని హామీల మాట



హెలిప్యాడ్‌లో జగన్‌ను కలవడానికి దూసుకొస్తున్న వలంటీరు పెంచలయ్య

● నిరాశపడ్డ వైసీపీ నేతలు ● మండుటెండ భరించలేక మధ్యలోనే వెనుదిరిగిన జనం

వెంకటగిరి/వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 28 : ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం వెంకటగిరికి వచ్చిన సీఎం జగన్మోహన్ రెడ్డి స్థానికంగా పలు సమస్యలకు సంబంధించి పరిష్కార హామీలు ఇస్తారని ఆశించిన వైసీపీ నాయకులతో పాటు జనానికి నిరాశే మిగిలింది. గత ఎన్నికల సమయంలో జగన్ హామీ ఇచ్చిన ఎస్ఎస్ కెనాల్ పూర్తి, ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులు ఏవీ కూడా పూర్తి కాలేదు.దీంతో మెట్ట ప్రాంత ప్రజలు సాగు, తాగునీరు కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితిలోనే వున్నారు. గత ఏడాది ఆగస్టులో వెంకటగిరి పర్యటనకు వచ్చిన సీఎం ఆల్తూరుపాడు రిజర్వాయర్ నిర్మాణం కోసం రూ. 530కోట్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పినప్పటికీ అదింకా టీడీపీ వేసిన పునాదుల్లోనే ఉండడం గమనార్హం. ఎన్నికల సందర్భంగా వచ్చారు కాబట్టి వరాలిస్తారని ఎదురుచూసిన జనం అలాంటిదేమీ లేకపోవడంతో నిరాశపడ్డారు.స్థానిక ఎన్‌జేఆర్ సర్కిల్ వద్ద జరిగిన ప్రచార సభలో ఆయన పాల్గొన్నారు.ఉదయం నుంచే బారికేడ్లతో రోడ్డును పోలీసులు బ్లాక్ చేయడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. కైవల్యానది, ఎన్‌జేఆర్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, క్రాస్ మీద వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.షెడ్యూల్ ప్రకారం 1.30గంటలకే రావాల్సిన జగన్ మధ్యాహ్నం 2గంటలకు కూడా రాకపోవడంతో చాలా మంది జనం ఎండకు తట్టుకోలేక వెనక్కి వెళ్లిపోయారు.2.30 గంటలకు వేదిక వద్దకు చేరుకున్న జగన్ 32నిమిషాలు మాట్లాడారు. కూటమి పార్టీలకు ఓట్లేస్తే సంక్షేమ పథకాలన్నీ ఆగిపోతాయంటూ జనాన్ని భయపెట్టే ప్రయత్నం చేశారు. ఆయన ప్రసంగిస్తుండగానే ఎండ దెబ్బ భరించలేక నెమ్మదిగా జనం తిరుగుముఖం పట్టారు.జగన్ మెప్పు పొందేందుకు స్థానిక వైసీపీ నేతలు చేసిన ప్రయత్నాలు వృధాగా మారాయి. మిట్టమధ్యాహ్నం 2.30గంటలకు సభ ప్రారంభం కావడంతో జనాలను పోగు చేసేందుకు తీవ్ర ఇబ్బంది పడాల్సి వచ్చింది. మద్యం, బిర్యానీ ప్యాకెట్లతో సీఎం వచ్చేవరకు సభకు సమీపంలో ఉంచగలిగారు కానీ సీఎం మాట్లాడుతున్న సమయంలో మాత్రం జనాలను ఆపలేకపోయారు.సీఎం సభకు రావాలని కౌన్సిలర్లు బలవంతపెట్టడంతో చాలా మంది అనారోగ్య పరిస్థితుల్లో ఉన్నప్పటికీ మండుటెండలో రావాల్సిన పరిస్థితి తలెత్తింది. 'సభ వద్ద కనిపించకపోతే పథకాలు కట్, మీ అంతు చూస్తాం, ఎండైనా రావాల్సిందే' అంటూ కొందరు వైసీపీ నేతలు బెదిరింపులకు దిగినట్టు సమాచారం.సభకు వచ్చిన వైసీపీ శ్రేణులతో, కిరాయి జనంతో సమీపంలోని మద్యం దుకాణాలు కిటకిటలాడాయి.ఎక్కడ పడితే చాలా మంది మద్యం సేవిస్తూ కనిపించారు. సీఎం తిరుగుప్రయాణమవుతున్న క్రమంలో హెలిప్యాడ్ వద్దకు డక్కిలి మండలం పెదయాచసముద్రం గ్రామ వలంటీరు కె.పెంచలయ్య దూసుకురావడం కలకలం రేపింది. గమనించిన సీఎం సెక్యూరిటీ సిబ్బంది అతడిని ఆపి హెలిప్యాడ్ నుంచి దూరంగా తీసుకొచ్చి బాంబ్‌స్క్వాడ్‌తో క్షుణ్ణంగా తనిఖీ చేశారు.విచారణలో తాను వలంటీరునని, సీఎంను కలవడానికి ప్రయత్నించానని చెప్పడంతో వదిలేశారు.



ట్రాఫిక్ ఆంక్షలతో స్తంభించిన ట్రాఫిక్



మద్యం దుకాణాల వద్ద వైసీపీ శ్రేణులు



బహిరంగంగానే మద్యం సేవిస్తున్న సభకొచ్చిన జనం

మీ మేనిఫెస్టోల్లో మేమెక్కడ?

ప్రశ్నిస్తున్న సెక్స్‌వర్కర్లు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఫోరం సభ్యులు

తిరుపతి(కపిలతీర్థం), ఏప్రిల్ 28 : "అన్ని రాజకీయ పార్టీలనూ హెచ్చరిస్తున్నాం.. ఎన్నికల మేనిఫెస్టోల్లో మా సమస్యలు ప్రస్తావించి పరిష్కారానికి హామీ ఇవ్వాలి. లేనిపక్షంలో మా ఓట్లన్నీ నోటాకి వేసి నిరసన తెలుపుతాం"అని సెక్స్‌వర్కర్ల ప్రతినిధులు ప్రకటించారు. మానవ అక్రమ రవాణా బాధిత మహిళల ఫోరం సభ్యులు రజని, లక్ష్మీ, ప్రసన్న, శాంతి ఆదివారం విముక్తి సేవా సంస్థ ప్రతినిధి రామ్మోహన్‌తో కలిసి తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. "బలవంతంగా సెక్సువర్కర్లుగా మమ్మల్ని మార్చారు. రాష్ట్రం విడిపోయిన తరువాత ఏ ప్రభుత్వమూ మా గురించి పట్టించుకోలేదు. గతంలో వేశ్య వృత్తిని వదిలేసినవారికి రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఇళ్లు అందించి సమాజంలో గౌరవంగా జీవించే దారి చూపేవారు. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. జీవనోపాధి లేక రాష్ట్రంలో దాదాపు నాలుగు లక్షల మంది మా లాంటి వారు దుర్భర జీవితాలను గడుపుతున్నారు." అని కన్నీటితో తెలిపారు.తమ సమస్యలను గుర్తించి,భవిష్యత్తుకు దారి చూపే పార్టీలకే మా మద్దతు ఉంటుందని ప్రకటించారు.

పోలింగ్ విధుల్లో 15,936 మంది

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 28: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ విధుల్లో 15,936మంది ఉంటారని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల పరిశీలకులు ఉజ్వల్‌కుమార్ ఘోష్, జ్యోతితో కలిసి కలెక్టరేట్‌లో ఆదివారం రాజకీయ పార్టీ నేతల సమక్షంలో పోలింగ్ సిబ్బంది రెండో దఫా ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పోలింగ్ విధులు కేటాయించిన సిబ్బందికి తిరిగి మే2న శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పోలింగ్ విధుల్లో పీవోలు 2,094, సహాయ పోలింగ్‌అధికారులు 2,094, ఇతర సిబ్బంది 8,376 ఉంటారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల నేతల సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. చంద్రగిరి నియోజకవర్గంలో భారీగా ఓటరు ఎపిక్‌కార్డులు గల్లంతయ్యాయని టీడీపీ మహిళా నేత పులివర్తి సుధారెడ్డి.. కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు కోరారు.

నేటినుంచి అమల్లోకి ల్యాండ్ టైటిలింగ్ చట్టం

● పైలట్ ప్రాజెక్టుగా రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఏప్రిల్ 28: ల్యాండ్ టైటిలింగ్ చట్టం సోమవారం నుంచి అమలు కానుంది. ఇందుకోసం పైలట్ ప్రాజెక్ట్‌గా రాష్ట్రవ్యాప్తంగా 16 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. మన జిల్లాలో రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నూతన విధానాన్ని అమలు చేయనున్నారు. ఇకపై ఏదైనా ఆస్తి రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో కొనుగోలుచేసి, రిజిస్ట్రేషన్ చేయించుకుంటే సంబంధిత కొనుగోలుదారులకు జిరాక్స్ పత్రాలు మాత్రమే జారీ అవుతాయి. గతంలో మాదిరిగా స్టాంపు పేపర్లు ఉండవు.

నూతన విధానమిలా : కంప్యూటర్‌లో సంబంధిత ఫారం నింపి రిజిస్ట్రేషన్‌కు పంపించాలి. ఆ ఫారంపై విక్రయదారులు, కొనుగోలుదారులతోపాటు సబ్‌రిజిస్ట్రార్ సంతకాలు పెట్టి, స్కాన్‌చేసి కొనుగోలుదారులకు ఈ-మెయిల్‌కు లేదా వాట్సప్‌కు పంపిస్తారు. ఈ-మెయిల్‌కు వచ్చిన పత్రాలను ప్రింట్ తీసుకుంటే వచ్చే ఇకపై అవే ఆస్తికి సంబంధించిన హక్కు పత్రాలు కానున్నాయి. 15 రోజుల తర్వాత ఈ విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నారు. ఈ విధానం మోసగాళ్లకు వరంలా మారుతుందని ఎంతమంది వ్యతిరేకించినా రాష్ట్ర ప్రభుత్వం ముందుకే వెళ్లడం గమనార్హం.

బ్యాంకు అకౌంట్లలోకి 'పింఛన్ల' జమ

● ఖాతా లేనివారికి ఇంటి వద్దే నగదు పంపిణీ
● సచివాలయాలకు ఎవరూ రానవసరం లేదు: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 28: సామాజిక భద్రతా పింఛన్లను బుధవారం నుంచి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే జమ చేస్తారని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బ్యాంకు ఖాతా లేని వారికి, డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ఫెయిల్ అయిన వారికి ఇంటి వద్దే గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా నగదు పంపిణీ చేయనున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛన్ల కోసం ఎవరూ సచివాలయాల వద్దకు రావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. మే ఒకటి నుంచి మూడో తేదీ సాయంత్రంలోపు పింఛన్ల పంపిణీ పూర్తి చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు.

ఏపీ సెట్‌కు 82 శాతం హాజరు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 28: తిరుపతిలో నిర్వహించిన ఏపీసెట్‌కు 82 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. 4073మంది దరఖాస్తు చేసుకోగా, 3365 మంది పరీక్ష రాశారు. ఎస్వీయూ, పద్మావతి మహిళా వర్సిటీలతోపాటు ఎస్వీ పద్మావతి కాలేజీ కేంద్రాల్లో పరీక్షలు జరగ్గా.. ఎస్వీయూ అధికారులు పర్యవేక్షించారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్టు ఎస్వీయూ మీడియా కో-ఆర్డినేటర్ పీసీ వెంకటేశ్వర్లు తెలిపారు.



పరీక్షలను పర్యవేక్షిస్తున్న అధికారులు

జగన్ రెడ్డీ... నీ ఆటలిక సాగవు

● గుడితో పాటు లింగాన్నీ మింగే బియ్యపు రెడ్డి ● ఇసుక కింగ్ కిలివేటి సంజీవయ్య ● సూళ్లూరుపేట,రేణిగుంట సభల్లో బాలకృష్ణ





రేణిగుంట సభలో టీడీపీ, బీజేపీ అభ్యర్థులు, నేతలతో బాలకృష్ణ

రేణిగుంట , ఏప్రిల్ 28 : 'జగన్ రెడ్డీ ఇక నీ ఆటలు సాగవు. మొదలైన ఎన్నికల యుద్ధంలో ఓటమిని తట్టుకునేందుకు సిద్ధంగా ఉండు. నీ పొగరు అణిచే రోజు వచ్చింది. సునామీ యుద్ధం రాబోతుంది, అందరూ సిద్ధంగా ఉండండి. ఎన్డీఏ కూటమి విజయాన్ని ఆపే శక్తి ఎవరికీ లేదు' అని హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ స్పష్టం చేశారు. స్వర్ణాంధ్ర సాకార యాత్రలో భాగంగా ఆదివారం రాత్రి శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలోని రేణిగుంటలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.'టీడీపీకి ఉన్న కార్యకర్తలు మరే పార్టీకి లేరు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఐదేళ్ల పాటు వైసీపీ దౌర్జన్యాలను ఎదుర్కొన్నారు. ఇక మంచి రోజులు వస్తాయి. అభివృద్ధికి, నీతినిజాయితీలకు మారుపేరైన బొజ్జల గోపాలకృష్ణారెడ్డి స్థానంలో శ్రీకాళహస్తి గుడి, గుడిలో లింగాన్ని మింగేవాళ్లను చూస్తున్నాం.భూ కబ్జాలతో పాటు ఉద్యోగాలు అమ్ముకోవడంలో బియ్యపు రెడ్డిది ప్రత్యేక బ్రాండు. జగన్ రౌడీ రాజ్యానికి నిదర్శనం శ్రీకాళహస్తిలో సుధీర్ రెడ్డిపై హత్యాయత్నం' అంటూ బాలకృష్ణ ధ్వజమెత్తారు.

ఆలస్యానికి క్షమించండి

'రేణిగుంటకు రావడం ఆలస్యమైనందుకు క్షమించాలి. ఎక్కడికెళ్లినా మీ అభిమానంతో ఎక్కువ సమయం గడిపేలా చేస్తోంది. శ్రీకాళహస్తి, ఏర్పేడు, రేణిగుంటల్లో జనాన్ని చూస్తుంటే కూటమిని గెలిపించుకోవాలన్న మీ పట్టుదల, అకుంఠిత దీక్ష కనిపిస్తోంది.ఎక్కడ చూసినా.. సైకో పోవాలి.. సైకిల్ రావాలి అన్న నినాదాలే వినిపిస్తున్నాయి'అని బాలకృష్ణ చెప్పుకొచ్చారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి, బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద రావు ఈ సందర్భంగా బాలకృష్ణకు 500రూపాయల నోట్లతో తయారు చేయించిన కిరీటం పెట్టి నాణేల మాల వేసి సత్కరించారు.చేతికి కత్తి అందించారు.కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, టీడీపీ నేతలు నరసింహ యాదవ్, శ్రీధర్ వర్మ, బీజేపీ నేత కోలా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఇటువంటి ఎమ్మెల్యే మీకు అవసరమా?

ఆదివారం సాయంత్రం సూళ్లూరుపేటకు వచ్చిన బాలకృష్ణ ప్రచార రథంపై వినాయకుడి గుడి నుంచి బాపూజీ వీధి గుండా ఆర్టీసీ బస్టాండు వరకు రోడ్‌షో నిర్వహించారు.ఈ సందర్భంగా బాలయ్యను పలువురు గజమాలలు,శాలువాలతో సత్కరించారు.ఆయన రాకముందే అభిమానులు, పార్టీ నాయకులు భారీగా చేరుకోవడంతో సూళ్లూరుపేటంతా జనసంద్రంగా మారింది.అనంతరం బస్టాండ్ వద్ద జరిగిన సభలో బాలకృష్ణ మాట్లాడారు. ఇక్కడి ఎమ్మెల్యే ఇసుకలో కింగ్ అంట... మైనింగ్‌లో తోపు అంట... గ్రావెల్ కనిపిస్తే మాయం చేస్తాడంట.. దందాలు చేయడంతో డిగ్రీ పట్టా పొందాడంట... ఇటువంటి ఎమ్మెల్యే మీకు అవసరమా అంటూ ప్రజలను బాలకృష్ణ ప్రశ్నించారు.ప్రజల సమస్యలు పట్టని, అభివృద్ధి చేతకాని ఎమ్మెల్యేని ఇంటికి పంపాలంటూ పిలుపునిచ్చారు. బెదిరించి బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు దోచేయడం ప్రవృత్తిగా పెట్టుకున్నాడని దుయ్యబట్టారు.కరోనా సమయంలో మాస్క్ అడిగిన పాపానికి దళిత డాక్టర్ సుధాకర్‌ను మానసికంగా వేధించి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించిన ఈ ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే ప్రశ్నించకపోవడం దురదృష్టకరమన్నారు. రాబోయే ఎన్నికలు ఎంతో ప్రతిష్ఠాత్మకమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీకి,బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావుకు ఓటువేసి జగన్ అవినీతి పాలనకు చమరగీతం పాడాలని పిలుపునిచ్చారు. మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యే పరసారత్నం,టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి,నాయకులు కొండేపాటి గంగాప్రసాద్, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, జనసేన నాయకుడు ఉయ్యాల ప్రవీణ్, బీజేపీ నాయకులు ఆరణి విజయభాస్కర రెడ్డి, ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. - సూళ్లూరుపేట



సూళ్లూరుపేట సభలో కూటమి పార్టీల అభ్యర్థులతో బాలకృష్ణ

నిషేధిత జాబితా భూముల సమస్య పరిష్కరిస్తా

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని



సమావేశంలో మాట్లాడుతున్న పులివర్తి నాని

తిరుచానూరు, ఏప్రిల్ 28: మీ బిడ్డలా తోడుగా ఉంటానని.. ఒక్కఅవకాశం ఇచ్చి ఆదరించాలని చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని కోరారు. తిరుపతి రూరల్ మండలం శ్రీనివాసపురం పంచాయతీలో ఆదివారం మాజీ సర్పంచ్ గణపతి నాయుడు ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి ఇచ్చిన వాగ్ధానాల్లో ఒక్కటైనా నెరవేర్చారా అని ప్రశ్నించారు. 240, 241, 242 సర్వే నెంబర్లను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. తుమ్మలగుంటలో 32 ఎకరాలు ఆక్రమించి అందులో ఎమ్మెల్యే సతీమణికి 2.5 ఎకరాల మఠం భూమిని రిజిస్టర్ చేశారన్నారు. శ్రీనివాసపురంలో మాత్రమే ఎందుకు నిషేధం కొనసాగుతోందని నిలదీశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని నాని హామీ ఇచ్చారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

చంద్రగిరిలో భారీగా ఎపిక్ కార్డుల గల్లంతు

● ఓటమి భయంతోనే చెవిరెడ్డి

కొత్త అడ్డదారులు: పులివర్తి సుధారెడ్డి

తిరుచానూరు, ఏప్రిల్ 28: చంద్రగిరి నియోజకవర్గంలో భారీగా ఎపిక్ కార్డులు గల్లంతయ్యాయని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆమె కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను కలిసి పలు అంశాలపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పోలింగ్‌కు కేవలం 14 రోజులు మాత్రమే ఉందని, చంద్రగిరిలో ఎపిక్ కార్డులు చాలా వరకు ఓటర్లకు చేరలేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అడ్రస్ దొరక్కపోవడంతో పోస్టల్ సిబ్బంది వాటిని బీఎల్వోలకు అందజేసినట్లు తెలిసిందన్నారు. ప్రస్తుతం అవి ఎక్కడున్నాయో తెలపాలని కలెక్టర్‌ను కోరారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ రెండు రోజుల్లో వివరాలు అందజేస్తామని చెప్పారు. నామినేషన్ రోజున ఆర్డీవో కార్యాలయం ఎదుట రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగితే టీడీపీ కార్యకర్తలపైనే కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. ఎన్నికలు నిష్పాక్షికంగా జరిగేలా చూడాలని కోరారు. దొంగ ఓట్లపై పోరాటాలు చేయగా.. ప్రస్తుతం ఎమ్మెల్యే ఓటమి భయంతో కొత్త అడ్డదారులు వెతుక్కుంటున్నారని ఆరోపించారు.

పుణ్యక్షేత్రంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం



సమావేశంలో మాట్లాడుతున్న పులివర్తి సుధారెడ్డి

తిరుచానూరు, ఏప్రిల్ 28: పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుచానూరు పంచాయతీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని చంద్రగిరి టీడీపీ మహిళా నాయకురాలు పులివర్తి సుధారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి తిరుచానూరు యోగిమల్లవరంలో మహిళాశక్తికి అండగా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యోగిమల్లవరం పరిధిలో చెరువులు, కాలువలు, ప్రభుత్వ భూములను అధికార పార్టీ నేతలు ఆక్రమించారని ఆరోపించారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను మహిళలు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ ఎన్నికల్లో టీడీపీని ఆదరించి తన భర్త పులివర్తి నానిని గెలిపించాలని, అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తామని సుధారెడ్డి హామీ ఇచ్చారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: టీడీపీ



నెత్తకుప్పంలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రపురం, ఏప్రిల్ 28: జగన్ పాలనలో అన్నివిధాలా దివాలా తీసిన రాష్ట్రం చంద్రబాబు అధికారంలోకి వస్తేనే అభివృద్ధి చెందుతుందని టీడీపీ జిల్లా కార్యదర్శి జేడీ జగన్ అన్నారు. మండలంలోని నెత్తకుప్పం, వేపకుప్పం పంచాయతీల్లో ఆదివారం చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని గెలుపుకోసం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి మాట్లాడుతూ చెవిరెడ్డి పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్నా ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. ఈసారి ఎన్నికల్లో నాని గెలుపు తథ్యమన్నారు. టీడీపీ నాయకులు జనార్థన్‌చౌదరి, నరసింహారెడ్డి, ఉమాపతి నాయుడు, జేడీ జగన్, ఢిల్లీనాథరెడ్డి, ధనంజయరెడి, గిరి నాయుడు, జయచంద్ర నాయుడు, మాధవయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

తిరుచానూరు, ఏప్రిల్ 28: తిరుపతి జిల్లా స్వీప్ ఆధ్వర్యంలో ఆదివారం బాబు జగ్జీవన్‌రామ్ పార్కు వద్ద వాకర్స్‌కు ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు జరిగింది. జిల్లా స్వీప్ నోడల్ అధికారి డాక్టర్ వి.మురళీకృష్ణ మాట్లాడుతూ మే 13న జరిగే ఎన్నికల్లో ఓటు హక్కు కలిగినవారు తప్పకుండా తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. పార్కు వద్ద ఏర్పాటు చేసిన సెల్ఫీపాయింట్‌లో ఫొటో కార్యక్రమంలో ప్రజలు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

22 నుంచి అమ్మవారి వసంతోత్సవాలు

తిరుచానూరు, ఏప్రిల్ 28: తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో మే 22వ తేదీ నుంచి మూడ్రోజుల పాటు వార్షిక వసంతోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. మే 21వ తేదీ సాయంత్రం 6గంటలకు అంకురార్పణ నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా మే 23వ తేదీ ఉదయం స్వర్ణరథోత్సం జరుగనుంది. మూడ్రోజుల పాటు మధ్యాహ్నం ఫ్రైడే గార్డెన్‌లో అమ్మవారిఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. రాత్రి ఆలయ నాలుగు మాడవీధుల్లో పద్మావతిదేవి ఊరేగనున్నారు. వసంతోత్సవాలను పురస్కరించుకుని మే 14న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. మే 14తో పాటు మే 21 నుంచి 24వ తేదీ వరకు జరిగే కల్యాణోత్సవం, సహస్ర దీపాలంకరణ, మే 23న తిరుప్పావడ సేవ, మే 24న లక్ష్మీ పూజ ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది.

సీఎం జగన్ సభకు జనమెక్కడ: చింతా మోహన్



తిరుపతి(కపిలతీర్థం), ఏప్రిల్ 28: సీఎం జగన్ వెంకటగిరిలో బహిరంగ సభ పెడితే జనం లేక వెలవెలబోయిందని తిరుపతి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చింతా మోహన్ ఎద్దేవ చేశారు. నంది సర్కిల్ నుంచి కపిలతీర్థం రోడ్డు మీదుగా ఆయన ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. రాష్ట్రాన్ని అన్నివిధాలా దోచుకుని భ్రష్టు పట్టించిన జగన్‌ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని చెప్పారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం తథ్యమని చెప్పారు.

చంద్రగిరి

కనువిందు చేసిన నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న కళాకారులు

తిరుచానూరు, ఏప్రిల్ 28: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం రాత్రి చిత్తూరుకు చెందిన జయతీ స్కూల్ ఆఫ్ కూచిపూడి ఆధ్వర్యంలో ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన నగరవాసులకు కనువిందు చేసింది. అర్ధనారీశ్వరం, చంద్రచూడు, మధురాష్టకం, వేయీ నామాలవాడా, గంధముపుయ్యగా వంటి కీర్తనలకు కళాకారులు తేజశ్రీ, నందని, రవళిక, దీపాళీ, కుందన, రష్మిక, హోమియోధృతి, చక్రీష్, హర్షిత ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది. కళాకారులను శిల్పారామం ఏవో ఖాదరవల్లి ఘనంగా సన్మానించారు.

వేడుకగా మండలాభిషేక మహోత్సవం



చంద్రగిరి, ఏప్రిల్ 28: చంద్రగిరి జాతీయ రహదారిలో వెలసిన నాగాలమ్మ ఆలయ ఆవరణలో ఆదివారం మండలాభిషేక మహోత్సవం వేడుకగా జరిగింది. గత నెల 13వ తేదీన నాగాలమ్మ ఆలయంలో గణపతి, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన జరిగింది. ఇందులో భాగంగా వేదపండితులు శివరామశర్మ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం గణపతిపూజ, అనుజ్ఞ స్వస్తివాచనం, నవగ్రహ సహిత అష్టదిక్పాలకపూజ, ప్రధాన కలశ ఆరాధనలు, ప్రాయశ్చిత్త హోమాదులు, అమ్మవారికి అభిషేక పూజలు, తీర్థ ప్రసాద వినియోగం కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదానం చేశారు. నాగాలమ్మ ఆలయ ధర్మకర్త ఒంటి శివశంకర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పనపాకంలో భగవద్గీతపై ప్రచారం



చంద్రగిరి, ఏప్రిల్ 28: చంద్రగిరి మండలం, పనపాకం పంచాయతీలో ఆదివారం త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. వేదిక సభ్యులు మాధవ, శ్రీనివాసులు, జయసుధ, రామకృష్ణ, వెంకటరత్నమ్మ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై శిక్షణ



మాట్లాడుతున్న నిషాంత్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 28: ఈవీఎంల వినియోగంపై నాల్గవ దశ శిక్షణా కార్యక్రమాన్ని పద్మావతి మహిళా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో ఆదివారం నిర్వహించారు. ఇందులో అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్లు, సెక్టార్ అధికారులు, తిరుపతి రూరల్ మండల పరిధిలోని 150 మంది బీఎల్వోలకు చంద్రగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నిషాంత్ రెడ్డి శిక్షణ ఇచ్చారు. ఈవీఎంల వినియోగం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ రోజున నిర్వహించవలసిన బాధ్యతలను కూడా వివరించారు.

శుద్ధ జల కేంద్రంలో కలుషిత నీరు..!



నీటిని పట్టుకుంటున్న రోగులు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 28: రుయాస్పత్రిలోని రోగులు, వారి సహాయకులకు శుద్ధమైన తాగునీటిని అందించేందుకు రెండేళ్ల కిందట రాజు వేగ్నేశ ఫౌండేషన్ నిర్వాహకులు భారీ ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేశారు. ఈ ప్లాంటు ఏర్పాటు చేసి రెండేళ్లకుపైగా అవుతున్నా ఇంత వరకు ఒక్కసారి కూడా శుభ్రం చేయలేదన్న ఆరోపణలున్నాయి. దీనివల్ల కలుషిత నీరు వస్తోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా రుయా అధికారులు ఈ ప్లాంటును శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షలపై సదస్సుకు విశేష స్పందన

● విశ్వం స్కూల్ అధినేత విశ్వనాథరెడ్డి

తిరుపతి(విద్య), ఏప్రిల్ 28: వరదరాజ నగరంలోని విశ్వం స్కూల్లో ఆదివారం సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షలపై నిర్వహించిన ఉచిత అవగాహన సదస్సుకు విశేష స్పందన లభించిందని అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథరెడ్డి తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నవోదయ, సైనిక్, మిలటరీ స్కూళ్లలో విద్యనార్జించినవారికి మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. మంచి శిక్షణ తీసుకుంటే ఈ విద్యాసంస్థల్లో సులభంగా సీట్లు పొందొచ్చన్నారు. నవోదయ, సైనిక్, మిలటరీ సూళ్ల ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక శిక్షణనిస్తూ విశ్వం విద్యాసంస్థలు రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుస్తున్నాయని అన్నారు. జాతీయస్థాయిలో జరిగే సైనిక్, నవోదయ పరీక్షల్లో విజయం సాధించి సీట్లు పొందేందుకు మెలకువలను తెలియజేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల అనుమానాలను నివృత్తి చేశారు. పోటీ పరీక్షలకు సంబంధించి మరిన్ని వివరాలకు 86888 88802, 93999 76999 సెల్ నెంబర్లలో సంప్రదించవచ్చని విశ్వనాథరెడ్డి సూచించారు.

తిరుమలలో 17నుంచి పద్మావతి పరిణయోత్సవాలు

తిరుమల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మే నెలలో జరగనున్న ఉత్సవాల జాబితాను టీటీడీ ఆదివారం విడుదల చేసింది. 3న భాష్యకారుల ఉత్సవారంభం, 4న సర్వఏకాదశి, 12న భాష్యకారుల శాత్తుమొర, రామానుజ జయంతి, శంకర జయంతి, 17 నుంచి 19 వరకు పద్మావతి పరిణయోత్సవాలు, 22న నృసింహ జయంతి, వెంగమాంబ జయంతి, 23న అన్నమాచార్య జయంతి, కూర్మ జయంతి జరగనున్నాయి.

ఆరు నెలల్లో తెలుగుగంగ అందిస్తా: నాని



మాట్లాడుతున్న పులివర్తి నాని

మంగళం, ఏప్రిల్ 28: అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీ ప్రజలకు తెలుగుగంగ నీరు అందిస్తానని చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. ఆదివారం మంగళం పరిధిలో వైసీపీ నుంచి సతీష్ ఆధ్వర్యంలో టీడీపీలోకి 200మంది చేరారు. వారికి నాని కండువా పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ తిరుమలనగర్ పంచాయతీలో ఉన్న సర్వే ట్రైనింగ్ అకాడమీ స్థలాన్ని మార్పులు చేసి స్థానిక పేదలకు టిడ్కోఇళ్లు కట్టిస్తానని చెప్పారు. ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలో కొంతమంది ఎమ్మెల్యే చెవిరెడ్డి అనుచరుల వల్ల మహిళలకు రక్షణ లేకుండా పోతోందని అన్నారు. తాము అధికారంలోకి రాగానే ఇక్కడ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి మహిళలకు రక్షణ కల్పిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. టీడీపీ నాయకులు ఈశ్వరయ్య, రామంజేరి మహేశ్వరి, రమణ, శ్రీనివాస, గణపతి నాయుడు, శ్రీనివాసులు, సురేష్ నాయుడు, రవిచంద్ర, గోపీనాథ్, భాస్కర్‌రెడ్డి, నాగరాజు, సురేష్‌కుమార్, రామ్మూర్తియాదవ్, ధర్మారెడ్డి, రామకృష్ణ, మంగళం పరిధిలోని మంగళం, తిరుమలనగర్, సప్తగిరికాలనీ, రణధీరపురం పంచాయతీ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ నేతలు టీడీపీలో చేరిక

తిరుచానూరు, ఏప్రిల్ 28: తిరుపతి రూరల్ మండలం శ్రీనివాసపురం, పద్మావతిపురం పంచాయతీల్లో వైసీపీ నేతలు పెద్ద ఎత్తున ఆదివారం చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. శ్రీనివాసపురం వైసీపీ మాజీ మండలాధ్యక్షురాలు ఆదిలక్ష్మి, వార్డు మెంబర్లు పుష్పలత, గంగులమ్మ, ప్రభావతి, మహేశ్వరితో పాటు పద్మావతిపురంకు చెందిన వైసీపీ నాయకులు రమేష్‌బాబు, నరసయ్య, కౌశిక్, విష్ణు తదితరులు టీడీపీలో చేరారు. వైసీపీ ప్రభుత్వంలో తమ సొంత భూములకు రక్షణ లేకుండా పోయిందని, వచ్చే ఎన్నికల్లో పులివర్తి నాని విజయం కోసం కృషి చేస్తామన్నారు. అలాగే రణధీరపురం పంచాయతీకి చెందిన వైసీపీ నేతలు మురళీరెడ్డి, రఫీ, నాగేంద్ర తదితరులు టీడీపీలో చేరారు.

హరిపురం కాలనీలో...

తిరుపతి రూరల్, ఏప్రిల్ 28: తిరుపతి మండలం హరిపురం కాలనీకి చెందిన వైసీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు దామినేటి గంగయ్య ఆదివారం చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. గంగయ్యతోపాటు ఆయన అనుచరులు విశ్వనాథన్, గుడితి నాగరాజు, లాయర్ వెంకటాద్రి (ఆనంద్‌బాబు), సుబ్రహ్మణ్యం, బ్యాంక్ గిరి, హరీష్, రుక్కడ, నరేష్ కుమార్, ప్రకాష్, అయ్యప్ప, కుమార్, కార్తీక్, సుబ్బు, సిద్దయ్య, హరి, శేఖర్, శ్రావణ్‌కుమార్, అనిల్‌కుమార్, శివరాజ్, శరత్, కిరణ్, జనార్ధన్, రవి, నరేష్, భరత్, దేశయ్య, కామాక్షి, మమత, అరుణ, చిలకమ్మ, చిట్టెమ్మ, మాలతి, దుర్గ, శోభ, అపర్ణ, భార్గవి, నాగలక్ష్మి టీడీపీలో చేరినవారిలో ఉన్నారు. వీరిని నాని సాదరంగా ఆహ్వానించి పసుపు కండువాలు కప్పారు. టీడీపీ నేత బడి సుధాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాసపురంలో, హరిపురం కాలనీలో నాని సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నేతలు

తిరుమలేశుడి సేవలో న్యాయమూర్తులు



జస్టిస్ వేణుగోపాల్, జస్టిస్ బీఎస్ పాటిల్, జస్టిస్ పుష్ప సత్యనారాయణ

తిరుమల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈ.వేణుగోపాల్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోనికి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అలాగే కర్ణాటక లోకాయుక్తా జస్టిస్ బీఎస్ పాటిల్, నేషనల్ గ్రీన్‌ట్రిబ్యునల్ సౌత్ జోన్ జుడిషియల్ మెంబర్ జస్టిస్ పుష్ప సత్యనారాయణ స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి వేద పండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. అలాగే తమిళనాడు దేవదాయ మంత్రి శేఖర్‌బాబు, గజల్ శ్రీనివాస్, వారణాశి కమిషనర్ కుషల్‌రాజ్‌శర్మ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

చర్మ, సుఖవ్యాధులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న చంద్రశేఖరన్

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 28: చర్మ, సుఖ వ్యాధులపై ప్రతీ ఒక్కరికీ అవగాహన అవసరమని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ అన్నారు. ఎస్వీ వైద్య కళాశాలలో ఆదివారం చర్మ, సుఖ వ్యాధులకు సంబంధించి ప్రాంతీయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సుకు రాయలసీమ జోన్ నుంచి పది వైద్య కళాశాలలకు చెందిన 125 మంది చర్మవ్యాధి విభాగ పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ పరిశీలకులు డాక్టర్ తిరుపతిరెడ్డి, చర్మ వ్యాధి నిపుణులు శ్రీనివాసులు, పెంచలయ్య, కిషోర్‌కుమార్, హర్షవర్ధన్, సుమలత పాల్గొన్నారు.

వెల్డింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా: ఆరణి



సమావేశంలో మాట్లాడుతున్న ఆరణి శ్రీనివాసులు

తిరుపతి(కపిలతీర్థం), ఏప్రిల్ 28: ఆటోనగర్‌లో వెల్డింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని టీడీపీ, బీజేపీ బలపరుస్తున్న తిరుపతి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు భరోసా ఇచ్చారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ సింధూజ ఆధ్వర్యంలో శ్రీవెంకటేశ్వర ఫ్యాబ్రికేట్ వర్కర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం ఓ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరణి మాట్లాడుతూ.. ఏపీఐఐసీ కేటాయించిన స్థలాలను దుకాణ యజమానులకు దక్కేలా చూస్తామని చెప్పారు. టీడీపీ సీనియర్ నేత మబ్బు దేవనారాయణరెడ్డి మాట్లాడుతూ.. తిరుపతిని అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్న తండ్రీ కొడుకులు ఆటోనగర్‌లోని సమస్యలను ఎందుకు పరిష్కరించలేదో చెప్పాలని ప్రశ్నించారు. అనంతరం అసోసియేషన్‌కు చెందిన పలువురు ముఖ్యనేతలు టీఎన్‌టీయూసీలో చేరారు. మాజీ ఎమ్మెల్యేలు మోహన్, సుగుణమ్మ నేతలు కోడూరు బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఆట-పాట-మాట' శిబిరం ప్రారంభం

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 28: వేసవి సెలవుల్లో పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆట-పాట-మాట శిబిరం నిర్వహించడం సంతోషకరమని డీవైఈవో బాలాజీ అన్నారు. యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఈ శిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు. ప్రముఖ గణితావధాని అరుణ శివప్రసాద్.. లెక్కలు అంటే ఉన్న భయాన్ని పోగొట్టేలా పిల్లలతో ముచ్చటించారు. శిబిరంలో పాల్గొనే చిన్నారులకు అవసరమైన పుస్తకాలను హెచ్20 సంస్థ అందజేసింది. టెంకాయల దామోదరం అధ్యక్షత వహించగా, కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

ఏజెంట్లుగా ఉండరాదని అక్రమ కేసులు

● కోడ్ ఉన్నా పట్టించుకోని పోలీసులు ● పెద్దిరెడ్డిపై చల్లాబాబు ఫైర్

పుంగనూరు, ఏప్రిల్ 28: మంత్రి పెద్దిరెడ్డి ప్రయోజనం కోసం అక్రమంగా 140 మంది టీడీపీ నేతలపై రౌడీషీట్లు తెరిచి ఎన్నికల ఏజెంట్లుగా పనిచేయకుండా కుట్ర చేశారని పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి దుయ్యబట్టారు. ఆదివారం ఆయన పుంగనూరులో మాట్లాడుతూ మరో 15 రోజుల్లో మంత్రి, వారి పార్టీ అధికారం కోల్పోవడం ఖాయమని ఆ విషయాన్ని పుంగనూరు పోలీసులు ఇంకా గుర్తించడంలేదన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటన సందర్భంగా పోలీసులు అన్యాయంగా రెచ్చగొట్టి గొడవలు చేయించి నియోజకవర్గంలోని 500 మందిపై పెద్దిరెడ్డి ఆదేశాలతో అక్రమకేసులు పెట్టి జైళ్లకు పంపి హింసించారని విమర్శించారు. పుంగనూరుకు కొద్ది రోజుల్లో స్వాతంత్ర్యం వస్తుందన్నారు. మంత్రి దోపిడీ, దౌర్జన్యాలు, అరాచకాలు అంతం చేస్తానని చెప్పారు. పోలీసులు టీడీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. చౌడేపల్లెలో టీడీపీ మండల అధ్యక్షుడు గువ్వల రమేశ్‌రెడ్డితో పాటు కార్యకర్తలపై దాడిచేస్తే తిరిగి బాధితులపైనే కేసులు పెట్టడం దారుణమన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నా పోలీసులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దిరెడ్డి అరాచకాలు ప్రజలు గమనిస్తున్నారని ఎన్నికల్లో గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు బి.వెంకటమునియాదవ్, ప్రదీప్ ఉన్నారు.

అలరించిన దుర్యోధన వధ



వెదురుకుప్పం, ఏప్రిల్ 28: వెదురుకుప్పం మండలం మొరవ గ్రామ మహాభారతం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ఆవరణలో దుర్యోధన వధ ఘట్టం అలరించింది. దుర్యోధనుడి మట్టి బొమ్మ తయారు చేసి దుర్యోధనుడు, భీముడి వేషధారులు ఆ ఘట్టాన్ని ప్రదర్శించారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు జరిగాయి. అన్నదానం చేశారు. రాత్రి అగ్ని గుండ ప్రవేశంతో మహాభారత ఉత్సవాలు ముగిశాయి. ప్రధాన కార్యనిర్వాహకులు బోడిరెడ్డి మోహన్‌రెడ్డి, బోడిరెడ్డి తారకరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అపార్టుమెంట్ల లోగిళ్లలోకి డిజిటల్ ప్రచారం



తిరుపతిలోని ఓ అపార్టుమెంటులో ఏర్పాటైన డిజిటల్ బోర్డు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 28: అపార్టుమెంట్ల లోగిళ్లలోకి డిజిటల్ ప్రచారం చేరుకుంది. నిన్నా మొన్నటి వరకు సందులు, గొందుల్లో రాజకీయ కూలీల ద్వారా జెండాలు చేత పట్టించి, కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేసేవారు. ఇపుడు అపార్టుమెంట్ల మీద వైసీపీ నేతలు పడ్డారు. వీటికి అనుమతి ఉందా లేదా అన్నదే ప్రశ్నార్థకం.

ఎన్నికల బరిలో నిలిచేదెవరో..?

నేటితో ముగియనున్న నామినేషన్ల ఉపసంహరణ గడువు


తిరుపతి (కలెక్టరేట్), ఏప్రిల్ 28: సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచేదెవరనే దానిపై సోమవారం స్పష్టత రానుంది. నామినేషన్ల ఉపసంహరణకు చివరి రోజు కావడంతో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థుల్లో ఎవరైనా స్వయంగా రిటర్నింగ్ అధికారి వద్దకు వెళ్లి ఉపసంహరించుకోవచ్చని అధికారులు తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు సంబంధించి అఫిడవిట్లను ఆయా ఆర్వోల కార్యాలయాల్లోని నోటీసు బోర్డుల్లో ప్రదర్శించారు.సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఉపసంహరణ పర్వం ముగిసిన అనంతరం బరిలో మిగిలే వారెవరో తెలుస్తుంది.

నేడు చిత్తూరులో బాలకృష్ణ పర్యటన

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 28: టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సోమవారం చిత్తూరులో పర్యటించనున్నారు. 'స్వర్ణాంధ్ర సాకార యాత్ర'లో భాగంగా ఆయన సాయంత్రం 5.30 గంటలకు వెంగారెడ్డిపల్లె, 5.40 గంటలకు బ్యాన్స్ హోటల్ సర్కిల్, 5.50 గంటలకు సంతపేట రాగిమాను సర్కిల్, 5.55 గంటలకు గాంధీరోడ్డు, 6 గంటలకు గాంధీ సర్కిల్‌లో బహిరంగ సభలో పాల్గొంటారు. టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని సభను విజయవంతం చేయాలని చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

ఇక్కడ వెలవెల.. అక్కడ కళకళ

ఏపీ, కర్ణాటక సరిహద్దుల్లో పెట్రోల్ బంకుల పరిస్థితిదీ



వి.కోటలో మూతపడిన హెచ్‌పీ పెట్రోల్ బంకు



దాసార్లపల్లె వద్ద వాహనాలు రాక..


పక్కనున్న రేట్లు చూస్తే చాలు పెట్రోల్, డీజిల్‌పై మన రాష్ట్రంలో జగనన్న వ్యాట్ బాదుడు ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవడానికి. దీని ప్రభావం ఏపీ, కర్ణాటక సరిహద్దుల్లోని పెట్రోల్ బంకులపై పడింది. మిగతా చోట్ల ఎంత ధరయినా వాహనదారులు పెట్రోల్, డీజల్‌ను వాడుకోక తప్పదు. కానీ.. చిత్తూరు జిల్లా వి.కోటలో మాత్రం పరిస్థితి భిన్నం. వి.కోటకు కూతవేటు దూరంలో కర్ణాటక సరిహద్దు.. దాని వెంబడే పెట్రోల్ బంకులు ఉన్నాయి. దీంతో వాహనదారులు కిలోమీటరు దూరమైనా సరే అక్కడకు వెళ్లి ట్యాంకులు ఫుల్ చేసుకుని వస్తున్నారు. మరోవైపు కర్ణాటక- మన జిల్లా మధ్య రాకపోకలు సాగించే వాహనదారులూ ఆ రాష్ట్ర సరిహద్దులోనే ట్యాంకులు ఫుల్ చేయించేస్తున్నారు. దీంతో కర్ణాటక సరిహద్దులోని పెట్రోల్ బంకుల్లో ట్యాంకులు ఖాళీ అయిపోతుంటే.. మన దగ్గర వారాలైనా ట్యాంకర్ ఖాళీ కావడంలేదు. ఐదేళ్లుగా ఇదే పరిస్థితి. ఇక, రెండేళ్ల కిందట కుప్పం రోడ్డులోని హెచ్‌పీ పెట్రోల్ బంకుకు నిర్వహణ వ్యయం కూడా రావడంలేదని మూసేశారు. మిగిలి మూడు బంకుల్లో నామమాత్రంగా వ్యాపారం జరుగుతోంది. అదే సరిహద్దుకు ఆనుకుని.. కర్ణాటకలో ఐదేళ్ల కిందట ఒకే పెట్రోల్ బంకు ఉండేది. అక్కడ దేశంలోనే అత్యధిక లీటర్ల అమ్మకం జరుగుతోందని రివార్డులు పొందారు. గత రెండేళ్లలో మరో నాలుగు పెట్రోల్ బంకులు నెలకొల్పారు. తాజాగా మరొకటి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. రెండు రాష్ట్రాల మధ్య ధరల్లో రెండు, మూడు రూపాయలుంటే పర్వాలేదు కానీ.. రూ.13కిపైగా ఉంటే ఎలాగని వినియోగదారులు అంటున్నారు.

- వి.కోట

జగనన్న బాదుడు ఎఫెక్ట్



ఏపీ(రూ.ల్లో)		కర్ణాటక	తేడా
పెట్రోల్:	111.33	100.02	11.30
డీజిల్	98.99	86.10	13.80



కర్ణాటకలో వాహనాలతో కిక్కిరిసిన పెట్రోల్ బంకు



పొంతనపల్లె వద్ద ప్రారంభానికి సిద్ధమైన మరో పెట్రోల్ బంకు

తిరుపతి

తిరుపతి ప్రశాంతతను కాపాడండి

తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్

తిరుపతి(కపిలతీర్థం), ఏప్రిల్ 28: తిరుపతి ప్రశాంతతను కాపాడాలని తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్ కోరారు. ప్రెస్‌క్లబ్‌లో టీడీపీ నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్టీఆర్, చిరంజీవి వంటి ఎంతో మంది నేతలు ఇక్కడ నుంచే మొదట పోటీ చేసిన చరిత్ర ఉందన్నారు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చాక అల్లర్లకు, దాడులకు, ప్రతిపక్షాల ప్రచారాలను అడ్డుకోవడం, పోలీసుల కేసులు ఇలా సరికొత్త చరిత్రకు నాంది పలికిందని మండిపడ్డారు. కార్పొరేషన్ ఎన్నికల సమయంలోనూ అధికారులను, పోలీసులను అడ్డుపెట్టుకుని.. దొంగ ఓట్లకు, అల్లర్లకు పాల్పడి విజయం సాధించారని విమర్శించారు. ఇపుడు కూడా అదే మార్గంలో విజయం సాధించాలని వైసీపీ నేతలు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారని ఆరోపించారు. ఈసారి వారి ఆటలు సాగవని.. ఇప్పటికే వైసీపీ నేతలకు అనుకూలంగా వ్యవహరించిన అధికారుల పరిస్థితి ఏమైందో మిగిలిన అధికారులు తెలుసుకోవాలని సూచించారు. వైసీపీ నేతలు ఎన్ని ఎత్తుగడలు వేసినా.. ఈసారి ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడం తథ్యమన్నారు. టీడీపీ నేతలు ఈతమాకుల హేమంత్‌కుమార్ యాదవ్, చేజర్ల మనోహర్ పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.88 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.88 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ప్రకటించింది. శనివారం 81,212 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 41,690 మంది తలనీలాలు సమర్పించారు.

ఫ్రస్టేషన్లో వైసీపీ నేతల అల్లర్లు

'గాజు గ్లాసు'కు ఓటేయాలని ఊకా విజయ్‌కుమార్ ప్రచారం

తిరుపతి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఓటమిపాలవుతున్నామన్న ఫ్రస్టేషన్లో వైసీపీ నేతలు ఉన్నారని, అందుకే అల్లర్లు సృష్టిస్తున్నారంటూ టీడీపీ సీనియర్ నేత ఊకా విజయ్ కుమార్ ఆరోపించారు. ఆదివారం 31వ డివిజన్లో ఆయన విస్తృతంగా పర్యటించి.. గాజు గ్లాసు గుర్తుకు ఓటు వేయాలంటూ ఓటర్లను అభ్యర్థించారు. ఈకార్యక్రమంలో డివిజన్ నాయకులు బాలయ్య, గజ, అశోక్, రాజయ్య, మల్లి, శీను, దినేష్, విజయమ్మ, బేబీ పాల్గొన్నారు.



31వ డివిజన్లో ప్రచారం నిర్వహిస్తున్న ఊకా విజయ్ కుమార్

స్థానిక రెడ్లను భూమన ఎదగనివ్వడం లేదు

- నవీన్‌కుమార్‌రెడ్డి
- తిరుపతి సీటుపై కాంగ్రెస్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ జరిగింది
- టీటీడీ నిధులను ఏటీఎం కార్డులా వాడేస్తున్నారు
- రాష్ట్రంలోనే అతిపెద్ద కుంభకోణం టీడీఆర్ బాండ్లు

ఫటాఫట్ !



టీటీడీలో అవకతవకలు జరిగితే ఎలుగెత్తి ప్రశ్నించే తొలి గొంతు నవీన్‌కుమార్‌రెడ్డి. రాయలసీమ సాగునీటికి జరుగుతున్న ద్రోహం మీద విరుచుకుపడుతుంటారు. గతంలో తిరుపతి అసెంబ్లీకి జై సమైక్యాంధ్ర అభ్యర్థిగా పోటీచేసిన ఈయన మున్సిపల్ కౌన్సిలర్‌గానూ చేశారు. వీరి తాత మునస్వామిరెడ్డి, తండ్రి మునిరెడ్డి మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్లుగా పనిచేశారు. తిరుపతి నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించిన నవీన్‌కుమార్‌రెడ్డి ప్రస్తుతం ఆ పార్టీకి దూరమయ్యారు. తిరుపతి వర్తమాన పరిణామాలపై నవీన్‌కుమార్‌రెడ్డితో ఇంటర్వ్యూ..

? తిరుపతి అసెంబ్లీ సీటు మీకు ఎందుకు దక్కలేదు.

! దీని వెనుక పెద్ద మ్యాచ్ ఫిక్సింగ్ జరిగింది. షర్మిలకు భూమన కుటుంబంతో మంచి సంబంధాలు ఉన్నాయి. తిరుపతి కాంగ్రెస్ నాయకుల్లో ఒక్కరికి అవకాశమిచ్చినా అధికారపార్టీ అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డికి రెడ్ల ఓట్లు చీలిపోతాయి. నష్టం జరుగుతుంది. కాంగ్రెస్ నుంచి స్థానిక రెడ్లు ఎవ్వరూ పోటీలో లేకుండా అందుకే చేశారు. పొత్తుల పేరుతో తెలివిగా సీపీఐకి కేటాయించేశారు.

? మీ భవిష్యత్తు కార్యాచరణ ఏమిటి.

! కాంగ్రెస్‌పార్టీ బీఫారాలను వైసీపీ నాయకుల కనుసన్నుల్లోనే కేటాయించింది. ఏపీలో కాంగ్రెస్‌పార్టీని కోలుకోలేని దెబ్బకొట్టారు. అందుకే కాంగ్రెస్‌పార్టీకి, ఐఎన్‌టీయూసి జిల్లా గౌరవ అధ్యక్షపదవికి గుడ్‌బై చెబుతున్నా. త్వరలో తిరుపతి అభివృద్ధి, అవినీతి రహిత ప్రజాసంక్షేమం కోసం ఆత్మీయులతో చర్చించి నిర్ణయం తీసుకుంటా.

? తిరుపతిలోని స్థానిక రెడ్డి సామాజికవర్గం ఈ ఎన్నికల్లో ఎలా ఉండబోతోంది.

! అందరూ భూమనకు వ్యతిరేకంగా మారారు. కష్టపడి ఎన్నికల్లో గెలవడమే తప్పా తిరుపతిలోని స్థానిక రెడ్లకు పదవులు దక్కడం లేదు. వైఎస్ సీఎం అయినప్పటి నుంచీ ఇదే తీరు. గత పదిహేనేళ్లలో ఒక్క భూమన కుటుంబానికే ఎమ్మెల్యే సీటు, తుడా, టీటీడీ చైర్మన్ పదవులు కట్టబెట్టారు. స్థానిక రెడ్లకు పదవులు ఇస్తే తమ ఉనికికి ప్రమాదం అని భయపడే భూమన కరుణాకర్‌రెడ్డి ఎవరిని ఎదగనివ్వలేదు. ప్రతిపక్ష పార్టీల్లోని రెడ్లే కాదు అధికారపార్టీ వైసీపీలో ఉన్న రెడ్లలో కూడా చాలా అసంతృప్తి ఉంది.

? తిరుపతి నాయకులు టీటీడీ నిధులు వాడుకున్నారనే విమర్శల మీద మీ అభిప్రాయం.

! శ్రీవారి నిధులను ఏటీఎం కార్డులా వాడేస్తున్నారు. సివిల్ వర్క్స్ పేరుతో సత్రాలను కూల్చేసి వందలకోట్లతో నూతన భవనాల నిర్మాణాలు చేపట్టడం ఏమిటి? డిప్యూటేషన్‌పై వచ్చిన ధర్మారెడ్డి టీటీడీలో సకల శాఖల అధిపతిగా ఏకపక్షంగా పెత్తనం చేస్తున్నారు. తప్పులను ఎత్తిచూపే వారిపై తప్పుడు కేసులు పెడుతున్నారు. ఉద్యోగులు కూడా జరుగుతున్న తప్పులను బయటకు చెప్పలేక మదనపడుతున్నారు. ధర్మారెడ్డి కొనసాగింపుపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తా. టీటీడీలో ఆ'ధర్మ' పరిపాలనకు చమరగీతం పాడాలంటే ఉద్యోగులంతా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి.

? మాస్టర్‌ప్లాన్‌రోడ్ల వెనుక ఏం జరిగింది.

! మాస్టర్‌ప్లాన్ రోడ్లు ఏర్పాటు వెనుక మాస్టర్‌మైండ్ ఉంది. అవసరమున్న చోట్ల రోడ్లు వేయాలి. కానీ అధికారపార్టీకి చెందిన వ్యక్తుల స్థలాల వద్దరోడ్లు వేశారు. ఈరోడ్లు వేసిన చోట సజ్జల రామకృష్ణారెడ్డి స్థలం కూడా పది ఎకరాలు ఉంది. టీడీఆర్ బాండ్లను బూచిగా చూపించి పది శాతంగా ఉన్న భూములను వంద శాతానికి పెంచేలా చేశారు. రాష్ట్రంలోనే ఇదో పెద్ద కుంభకోణం. ప్రభుత్వం మారిన వెంటనే దీనిపై విచారణ జరిపితే అధికార పార్టీ నాయకులు, వారికి సహకరించిన అధికారులు శ్రీకృష్ణజన్మస్థానానికి చేరుకుంటారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

యువతను గంజాయి మత్తులో ముంచుతున్న వైసీపీ

ఎన్డీయే కూటమి నేతల ఆగ్రహం

తిరుపతి(కపిలతీర్థం), ఏప్రిల్ 28: రాష్ట్రంలోని యువతను అరకు నుంచి కుప్పం వరకు గంజాయిలో మత్తులో వైసీపీ ముంచుతోందని ఎన్డీయే కూటమి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం కూటమి నేతలు బీజేపీ నేత కొత్తపల్లి అజయ్‌కుమార్, టీడీపీ నేత వట్టికుంట చిన్నబాబు, జనసేన వీరమహిళ ఆకేపాటి సుభాషిణి మీడియాతో మాట్లాడారు. ఇటీవల జూపార్కులోని సింహం కేవ్‌లోకి దిగి మృతి చెందిన రాజస్థాన్ యువకుడు కూడా గంజాయి మత్తులోనే ఉన్నాడని, కానీ ఆ దిశగా విచారణ చేయలేదని ఆరోపించారు. నేతలు వినోద్, చందన, మురళీ, శరత్, తేజ తదితరులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లు వేసుకోవడానికి వైసీపీ ప్రణాళిక

- టీడీపీ నేత మబ్బు దేవనారాయణరెడ్డి

తిరుపతి(కపిలతీర్థం), ఏప్రిల్ 28 : దొంగ ఓట్లు వేసుకోవడానికి వైసీపీ ప్రణాళిక సిద్ధం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే మబ్బు రామిరెడ్డి కుమారుడు, టీడీపీ నేత మబ్బు దేవనారాయణరెడ్డి ఆరోపించారు. ప్రెస్‌క్లబ్ ఆదివారం టీడీపీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఎవరైనా దొంగ ఓటు వేస్తే.. జీవితంలో వారి సొంత ఓటు కూడా వేసుకునేందుకు భయపడేలా శిక్ష ఉంటుందని హెచ్చరించారు. వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పి.. ఇంటికి సాగనంపే రోజు దగ్గర పడిందని చెప్పారు.

మహిళలకు రక్షణ లేదు

- టీడీపీ నేత కోడూరు బాలసుబ్రహ్మణ్యం

తిరుపతి(కపిలతీర్థం), ఏప్రిల్ 28: వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని టీడీపీ నేత కోడూరు బాలసుబ్రహ్మణ్యం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం టీడీపీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకొచ్చి స్థలం కొనుగోలు చేసిన వారి దస్త్రాలను ప్రభుత్వానికి అప్పగించాలంటూ నియమాలు పెట్టి.. ఆ స్థలాలను తాకట్టు పెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. ఇవన్నీ ప్రజలు గమనించాలని కోరారు. అనంతరం వైసీపీ అరాచకాలపై చార్జ్‌షీట్ విడుదల చేశారు. టీడీపీ నేతలు పెరుమాళ్ మధు, విజయలక్ష్మీ, సరోజనమ్మ, గౌతమ్, రాజా, చరణ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

దళిత ద్రోహి జగన్: సమతా సైనిక్ దళ్



మీడియాతో మాట్లాడుతున్న పాలేటి మహేశ్వరరావు

తిరుపతి(కపిలతీర్థం), ఏప్రిల్ 28 : దళిత ద్రోహి సీఎం జగన్ అని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు పాలేటి మహేశ్వరరావు విమర్శించారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ అంబేడ్కర్ కాలిగోటికి కూడా సమానం కాని జగన్.. అంబేడ్కర్ పేరు తీసేసి.. జగన్ విదేశీ విద్య అని మార్చేసి.. ఆయన సామాజిక వర్గానికి చెందిన వారిని మాత్రమే ఈ పథకానికి ఎంపిక చేసిన గొప్ప వ్యక్తి సీఎం అని మండిపడ్డారు. వైద్య కళాశాలల్లో సగం పేమెంటు సీట్లు పెట్టడం దేశంలోనే ఎక్కడా లేదన్నారు. రాష్ట్రంలో 1.30 లక్షల ఎకరాల ఎస్సీ, ఎస్టీల భూమిని ఇళ్ల స్థలాలకు, వైసీపీ కార్యాలయాలకు లాక్కున్న దుర్మార్గుడు జగనే అన్నారు. ఇవన్నీ పక్కన పెడితే వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై జరిగిన హత్యలు, అన్యాయాలు, అవమానాలు, అత్యాచారాలు బీహార్‌లో కూడా ఉండవని తెలిపారు. ఇక రాష్ట్రంలో 1,100 నామినేటెడ్ పోస్టులుంటే 750 పోస్టులు ఆయన సామాజిక వర్గానికే ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. ఇంతటి దుర్మార్గమైన ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో సరైన బుద్ధి చెప్పి ఇంటికి పంపకుంటే ఎస్సీ, ఎస్టీ, బీసీలను భూస్థాపితం చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్రబాబు, రాష్ట్ర కార్యదర్శి రొంపిచర్ల నాగేశ్వరావు, జిల్లా గౌరవాధ్యక్షులు రెడ్డెప్ప, దాసు, ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.

1న సివిల్ సర్వీసెస్ పరీక్షపై సదస్సు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 28: మహతి కళాక్షేత్రంలో పాత్ టు సివిల్ సర్వీసెస్ ఇన్‌సైట్స్ అండ్ స్ట్రాటజీస్ పేరిట అవగాహన సదస్సు మే ఒకటో తేదీన నిర్వహించనున్నట్లు నారాయణ ఐఏఎస్ అకాడమీ సీనియర్ మేనేజర్ అనంతకృష్ణసాయి తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సదస్సుకు ముఖ్యఅతిథిగా విశ్రాంత ఐఏఎస్ కె.రత్నప్రభ హాజరవుతారన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తారని చెప్పారు. రత్నప్రభ చేతులమీదుగా కలెక్టరమ్మ పుస్తకావిష్కరణ చేయనున్నట్లు తెలిపారు. అకాడమీ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

తిరుపతిలో కడప ఫ్యాక్షన్‌కి చోటు లేదు

గంజాయి బ్యాచ్‌తో కరుణాకర రెడ్డి గొడవలు చేస్తూ.. నిందలు మాపైనా

ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు మండిపాటు

తిరుపతి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో కడప ఫ్యాక్షన్ రాజకీయాలకు చోటు లేదని టీడీపీ, బీజేపీ బలపరుస్తున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు స్పష్టం చేశారు. 'కడప సంస్కృతిని తిరుపతిలో 30 ఏళ్లుగా అమలు చేస్తున్నది నువ్వు కాదా? హత్యా రాజకీయాలు, సెటిల్మెంట్ దందాలకు పెట్టింది పేరైన నీకు.. నన్ను విమర్శించే అర్హత లేదు' అని ఎమ్మెల్యే కరుణాకరరెడ్డిపై ఆరణి మండిపడ్డారు. ఆదివారం 46, 47, 48, 49 డివిజన్లలోని సత్యనారాయణపురం, జీవకోన, రాఘవేంద్రనగరలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మబ్బు దేవనారాయణ రెడ్డి నేతృత్వంలో ఇంటింటి ప్రచారం జరిగింది. ఈసందర్భంగా ఆరణి మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం అనుమతితో తాము ప్రచారం నిర్వహిస్తుంటే కరుణాకరరెడ్డి.. గంజాయి బ్యాచ్‌ను పంపి గొడవలు సృష్టిస్తున్నారని విమర్శించారు. వైసీపీ గూండాలు మాపైకి దాడికి వస్తుంటే పోలీసులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారని ఆరోపించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు మేం సహకరిస్తుంటే.. వైసీపీ గొడవలు సృష్టించి ఓటర్లను బెదిరించాలని చూస్తోందన్నారు. దీనికి ప్రధానకారకులు భూమన కరుణాకరరెడ్డి, అభినయ్ రెడ్డీలే పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మోహన్, సుగుణమ్మ, నాయకులు అన్నా రామచంద్రయ్య, జేబీ శ్రీనివాస్, పొలకల మల్లికార్జున్, అన్నా రామకృష్ణ, కార్పొరేటర్లు ఆర్సీ మునికృష్ణ, అన్నా అనిత, చినబాబు, సింగంశెట్టి సుబ్బరామయ్య, తిరుమల కేశవులు, పాటకం వెంకటేష్, రుద్రకోటి సదాశివం జనసేన నాయకులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, సుభాషిణి, బండ్ల లక్ష్మీపతి రాయల్, బీజేపీ నేత పొనగంటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. దీనికి ముందు 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన చిన్న, రమణ, శివ, రాఘవ, సాయిలతోపాటు 23మంది టీడీపీలో చేరారు. వీరికి కండువాలు కప్పి సుగుణమ్మ పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ కుమారుడు నవీన్, జనసేన నేత మురళి తదితరులు పాల్గొన్నారు.



జీవకోనలో కూటమినేతల ప్రచారం



ఆరణి, సుగుణమ్మ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

దుష్టపాలనకు రోజులు దగ్గరపడ్డాయ్!

జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ ప్రచార జోరు



గాజు గ్లాసు గుర్తుకు ఓటేయాలని వెంకటరెడ్డి కాలనీలోని వీధివ్యాపారులను కోరుతున్న కిరణ్‌రాయల్

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 28: దుష్టపాలనకు రోజులు దగ్గరపడ్డాయని జనసేన అసెంబ్లీ ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ అన్నారు. కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు గెలుపుకోసం తనవంతుగా ప్రచార జోరు పెంచారు. ఆదివారం ఉదయం 12వ డివిజన్‌లోని వెంకటరెడ్డికాలనీ, రాజారెడ్డికాలనీలో తన మిత్రులు, కార్యకర్తలతో కలసి పలు వీధుల్లో పర్యటిస్తూ ఇంటింటా ఓటర్లను పలకరించారు. వీధివ్యాపారులతో మాట్లాడుతూ.. త్వరలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రానుందని, అందరి బతుకులు ఆనందంతో విరాజిల్లుతాయని హామీ ఇచ్చారు. దుర్మార్గులను తరిమికొట్టేందుకు గాజుగ్లాసు గుర్తుకు ఓటువేసి ఆరణిని గెలిపించాలని కోరారు. 12వ డివిజన్ అధ్యక్షుడు రుద్రకిషోర్, లక్ష్మి, స్వరూప, రాజా, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ తాటాకు చప్పుళ్లకు వెరవం

టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ



35వ డివిజన్లో ప్రచారం నిర్వహిస్తున్న ఆర్సీ మునికృష్ణ

తిరుపతి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): 'తిరుపతిలో విధ్వంసాలు సృష్టించాలని వైసీపీ కుట్ర పన్నుతోంది. ఇలాంటి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు' అని టీడీపీ 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ అన్నారు. ఆదివారం తన డివిజన్లో కూటమి కార్యకర్తలతో కలసి జోరుగా ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. భూమన కరుణాకర రెడ్డి, అభినయ్ రెడ్డిల నైజం తిరుపతి ప్రజలకు తెలుసునని, ఎన్ని కుయుక్తులు పన్నినా నమ్మేవారు లేరన్నారు. ప్రశాంతమైన ఎన్నికలకు సహకరించకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థికి గాజు గ్లాసు, ఎంపీ అభ్యర్థికి కమలం గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు ఎస్సీఎం శ్రీధర్, జగన్నాథం, శ్రీలక్ష్మి, రాజేష్ ఆచారి, హరిశంకర్, సురేష్, రవి, సుజాతమ్మ, దర్శన్ రెడ్డి, అయ్యప్ప రాయల్, రాధ, సుజాత పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- రుయాలో మళ్లీ రగులుకుంటున్న మంటలు



ఇటీవల అగ్నిమాపక అధికారులు ఆర్పిన చోటే మళ్లీ వస్తున్న పొగలు



అదే ప్రదేశంలో మళ్లీ వేసిన బయో వ్యర్థాలు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 28: రుయాస్పత్రిలోని అంటువ్యాధుల వార్డు, టీబీ వార్డు పక్కనే ఆస్పత్రిలోని బయో వ్యర్థాలు, ఇతర చెత్తా చెదారాన్ని నిల్వ చేస్తుండటంతో ఈ నెలలోనే ఇక్కడ రెండు సార్లు భారీ అగ్నిప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది. కానీ అధికారులు మాత్రం దీనిపై దృష్టి సారించకపోవడంతో తిరిగి అదే ప్రదేశంలో పారిశుద్ధ్య నిర్వాహకులు మళ్లీ బయో వ్యర్థాలను, చెత్తాచెదారాన్ని వేస్తున్నారు. అనువైన ప్రదేశం చూసే వరకు ఇక్కడే వేయాలని అధికారులు చెబుతుండటంతో గత్యంతరం లేక అక్కడే వేయాల్సిన వస్తుందని పారిశుద్ధ్య నిర్వాహకులు పేర్కొంటున్నారు. కాగా, ఆదివారం నుంచి ఈ వ్యర్థాల్లో మంటలు రగులుకుని పొగలు వస్తున్నాయి. ఇలాగే వదిలేస్తే మళ్లీ భారీ అగ్నిప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇకనైనా రుయా అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వైసీపీకి బుద్ధి చెప్పాలి

- తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు





తిరుపతి, సూళ్లూరుపేటల్లో ప్రచారం నిర్వహిస్తున్న తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు

తిరుపతి, (ఉపాధ్యాయనగర్)/సూళ్లూరుపేట, ఏప్రిల్ 28: దళితులంటే వైసీపీకి చాల చిన్నచూపని ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు అన్నారు. ఆదివారం తిరుపతి నగరంలోని కపిలతీర్థంరోడ్డు, అన్నారావుసర్కిల్, ద్వారకానగర్, రామచంద్రానగర్, ప్రశాంతినగర్ ప్రాంతాల్లో కుటుంబసభ్యులు, టీజేపీ నాయకులతో కలసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థులకు ఓట్లువేసి గెలిపించాలంటూ అభ్యర్థించారు. దేశం ఎన్నడూలేనంత అభివృద్ధిని సాధించిందని, సుస్థిరతకు బీజేపీ అధిక ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ఐదేళ్ల జగన్ ప్రభుత్వంలో అభివృద్ధి అన్నది కానరావడం లేదని దాన్ని ప్రశ్నిస్తే తమను చులకనగా చూశారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవస్థలు నిర్వీర్యం అయిపోగా, ఖనిజ సంపద దోపిడీకి గురైందన్నారు. తాను ఈ విషయాల్ని బీజేపీ పెద్దలకు ఫిర్యాదు చేస్తానన్నారు. 27మంది దళిత ఎమ్మెల్యేలుంటే 23మంది ఎమ్మెల్యేలను పక్కనపెట్టిన వైసీపీ దళితులపట్ల కపటప్రేమను కనబరుస్తోందన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో అభివృద్ధికి కృషి చేశానని మరోసారి అవకాశం ఇస్తే మరింత ముందుకు తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఆయన కుటుంబ సభ్యులు కొల్లూరి లక్ష్మి, నవీన్‌గుప్తా, డాక్టర్ ప్రీతి, డాక్టర్ స్ఫూర్తి, అరుణ్ కల్యాణ్ సుందరం, మాజీ ఐపీఎస్ అధికారి శేఖర్, సామాజిక సేవా కార్యకర్త కొపారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వారధి కింద చిల్లర బంకులేంటి?



తిరుపతి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తిరునగరానికి కంఠాభరణంగా నిలవాల్సిన గరుడ వారధి (శ్రీనివాస సేతు) చిల్లరకొట్టు సంతమార్కెట్‌లా తయారవుతోంది. తిరుమలబైపాస్ రోడ్డులోని ప్రకాశం మున్సిపల్ పార్కు ఎదురుగా వారధి కింద ఐదు బంకులు పెట్టేశారు. ఇందులో రెండు బంకుల్లో టిఫిన్, టీషాపులను తెరిచారు. దీనివల్ల కూడలిలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. నాలుగు నెలల క్రితం ఇదే ప్రాంతంలో ఓ పెద్ద బంకును ఏర్పాటుచేసి చికెన్ పకోడ అమ్మకాలు మొదలుపెట్టారు. దానిపై విమర్శలు రావడంతో మూసివేశారు. నెల కిందట నిబంధనలకు విరుద్ధంగా విభిన్న రంగులు, సైజులలో ఇనుప బంకులు తెచ్చి రాత్రికి రాత్రే పెట్టేశారు. వీటికి అధికార పార్టీకి చెందిన అయిన వాళ్ల కోసం నాయకుల ఒత్తిడితో అధికారులు కూడా నిబంధనలకు విరుద్ధంగా అనుమతిచ్చినట్లు సమాచారం.





మిస్ రమణయ్య



ఇదీ ముందు



'అదృష్టం ముందు తలుపు తడుతూవుంటే దురదృష్టం వెనుక తలుపు తోసుకుని వచ్చేసింది' అనే సామెత సూళ్లూరుపేటలో ఒక తెలుగుదేశం వీరాభిమాని విషయంలో నిజం అయ్యింది. 1989లో టీడీపీ టికెట్ల కోసం ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు అని ఎన్టీయార్ ప్రకటించారు దరఖాస్తుల కట్ట చేతబట్టుకుని స్థానిక టీడీపీ బాధ్యుడు హైదరాబాదుకి బయలుదేరారు. సమాచారం తెలిసి సూళ్లూరుపేటలో మెస్ నడుపుకునే టీడీపీ కార్యకర్త నూలేటి వెంకట రమణయ్య పరుగున రైల్వేస్టేషన్‌కి చేరుకుని తన దరఖాస్తు కూడా అందించారు. ఆ తర్వాత టీడీపీ జాబితా ప్రకటించారు. సూళ్లూరుపేట టీడీపీ అభ్యర్థిగా ఎన్టీయార్ మెస్ రమణయ్య పేరు ప్రకటించారు. అదృష్టం నీ మెస్‌ని వెతుక్కుంటూ వచ్చింది పో అంటూ అందరూ ఆయనను అభినందనలతో ముంచెత్తారు. ఆ తర్వాతే అదృష్టం అడ్డం తిరిగింది. ఓటర్ల జాబితాలో రమణయ్య పేరే లేదని బయటపడింది. కొత్తగా నమోదు చేసుకునే అవకాశమూ లేకపోయింది. దాంతో రమణయ్య బదులుగా సట్టి ప్రకాశం పేరు జాబితాలోకి ఎక్కింది. ఉసూరుమంటూ రమణయ్య తిరిగి మెస్‌లోకి నడిచారు. జాబితాలో తమ ఓటు ఉందా లేదా అన్నది చూసుకోవడం ఎంత ముఖ్యమో ఈ సంఘటన చెంపపెట్టులా చెప్పింది.

- తడ

బోరుమంటున్న బీరు బాబులు



తిరుపతిలో బీరు ప్రియులకు గొప్ప చిక్కొచ్చి పడింది. బయట ఎండలు మండిపోతుంటే చల్లగా బీరు తాగుదామని వెళ్తే స్టాక్ లేదనే మాట విని నిరాశ పడిపోతున్నారు. ఎప్పుడూ లేని కొరత ఇప్పుడేంటా అని మండిపడుతున్నారు. అసలేం జరుగుతోందంటే తిరుపతిలో దాదాపు 16 బార్లున్నాయి. బారుకు కనీసం ఒక్కో బ్రాండుకు చెందిన 400 బాక్సుల బీర్లు అవసరముంటాయి. బాక్సులో 12 బాటిళ్ళు ఉంటాయి. నగర బార్లలో అత్యధికం అధికార వైసీపీకి చెందిన వారివే. ఎన్నికల ప్రచారం మొదలయ్యాక బార్ల నిర్వాహకులు తమ పార్టీ నాయకుల కోరిక మేరకు అడిగిన చోటకు అడ్డదారుల్లో స్టాకు తరలిస్తున్నారని సమాచారం. గత ఏడాది ఇదే నెలలో జరిగిన అమ్మకాల ప్రకారం సరిచూసి 30 శాతం అదనంగా స్టాకు రిలీజ్ చేస్తున్నామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానకిరామ్ చెబుతున్నారు. కానీ స్టాకులో 70 శాతం బీర్లు వైసీపీ నాయకుల కనుసన్నల్లోకి మళ్లిపోతున్నాయి. డిమాండ్‌లో సగం కూడా తమకు ఇవ్వడం లేదని వైసీపీయేతర బార్ల నిర్వాహకులు చెపుతున్నారు. దీంతో బీరులకు కొరత ఏర్పడింది. చేసేదేం లేక కొందరు చీప్ లిక్కర్ వైపు మొగ్గు చూపుతున్నారు. బార్లపైన ఎక్సైజ్ శాఖకు అజమాయిషీ లేకపోవడం, సెబ్‌కు సిబ్బంది కొరత ఉండడంతో బీరు ప్రియులకు కష్టాలు తప్పడం లేదు.

- తిరుపతి(నేరవిభాగం)

నోట్ దిస్ పాయింట్


ప్రచారంలో నోరు పారేసుకుంటే జైలే




ప్రచారంలో నోరు అదుపులో పెట్టుకోకపోతే ఇబ్బందేనంటోంది ఎన్నికల నియామవళి. అభ్యర్థులే కాదు రాజకీయనేతలందరికీ ఈ రూలు వర్తిస్తుంది. వ్యక్తిగత విమర్శలు చేస్తే కటకటాల పాలు కాకతప్పదని హెచ్చరిస్తోంది. వ్యక్తిగత, కులం, వర్గం, మతం, ప్రాంతం పేరుతో రెచ్చగొట్టే వ్యాఖ్యలకు అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల సంఘం కఠిన నిబంధనలు రూపొందించింది. పైన ప్రస్తావించిన అంశాలకు సంబంధించి నోరుజారితే ఆర్పీ చట్టం 1951సెక్షన్ 125 ఐపీసీ, 153ఏ ఐపీసీ ప్రకారం మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసినా శిక్షార్హులే. మద్యం, డబ్బులు పంపిణీ చేసినా, తీసుకున్నా నేరస్తులుగా పరిగణిస్తారు. ఐపీసీ 171బి, 171 ఈ ప్రకారం ఏడాది జైలు శిక్ష విధిస్తారు. ప్రచారంలో లౌడ్ స్పీకర్లు వాడినా, ప్రత్యర్థులను ఇష్టమొచ్చినట్లు రెచ్చగొట్టేలా మీడియా సమావేశాలు పెట్టినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని నిబంధనలు ఉల్లంఘిస్తే తీవ్ర నేరంగా పరిగణిస్తారు సుమా..

- తిరుపతి(నేరవిభాగం)

శెట్టిపల్లె ఫైల్స్


శెట్టిపల్లె భూములు



తిరుపతి - ఆంధ్రజ్యోతి

శఠగోపం పెట్టేశారు

దశాబ్దాల వివాదంతో వైసీపీ గేమ్స్

శెట్టిపల్లి భూమి సమస్య అనే మాట తరచూ వార్తల్లోకి వస్తూ ఉంటుంది. తరాలుగా భూములకు యజమానులైన ప్రజలకు ఆ భూములపై హక్కులు లేకపోవడమే శెట్టిపల్లి సమస్య. ప్రభుత్వం తలచుకుంటే హక్కులు ఇచ్చేయడం సులభమే. అయితే ఈ భూముల విలువ బంగారంతో పోటీపడడంతోనే అందరి కన్నూ శెట్టిపల్లిమీద పడింది. పాత రికార్డుల్లో 636 ఎకరాలని ఉన్నా అమ్మకాలూ కొనుగోళ్ళూ, సీఆర్ఎస్‌కు కేటాయింపులూ వంటివి పోగా ఇంకా 550 ఎకరాలు అక్కడ ఉన్నాయి. ఒక ఎకరా రిజిస్ట్రేషన్ విలువ ఇక్కడ రూ. 65 లక్షలున్నా.. మార్కెట్ విలువను 1.4 కోట్లుగా పేర్కొన్నారు. వాస్తవానికి తిరుపతి నగరంలో దాదాపుగా భాగమైన ఈ భూమి ఎకరా రూ. 3 నుంచి 5 కోట్లు చేస్తుంది. ఈ లెక్కన ఇది రూ. 2000 కోట్ల విలువైన భూమి. ఈ విలువే శెట్టిపల్లి ప్రజలకు శాపంగా మారింది. మీకు కొంత .. మాకు కొంత పద్ధతిలో అభివృద్ధి చేస్తామంటూ టీడీపీ పాలనలో ప్రభుత్వమూ.. ఆ తర్వాత వైసీపీ పాలనలో తుడ, కార్పొరేషన్‌లు పోటీలు పడ్డాయి. అభివృద్ధి అంటూ జరిగితే తమకు కొనే, అమ్మే హక్కులు వస్తాయనీ, తమ భూమి విలువా పెరుగుతుందని ఆశపడ్డ శెట్టిపల్లి వాసులతో వైసీపీ నాయకులు ఆడుకున్నారు. అద్భుతాలు జరుగుతాయని కళ్లకు కడుతూ అబద్ధాలు చెప్పారు. చివరికి ఏమీ చేయకుండానే కాలం గడిపేశారు. వైసీపీ వంచన పరిణామాల పరంపర ఇలా కొనసాగింది...

■ శెట్టిపల్లి సమస్య ఇదీ..


శెట్టిపల్లె గ్రామం

తిరుపతి నగర పరిధిలోని శెట్టిపల్లె గ్రామంలో 636 ఎకరాల భూమి ఉంది. అనాదిగా 500 కుటుంబాల అధీనంలో ఈ భూమి ఉంది. ఈ భూమిలో వారు వ్యవసాయం చేసుకునే వారు. 3-5-1979లో ఇనామ్ చట్టం రద్దు అయిన ఏడాది జూన్ 25న శెట్టిపల్లి గ్రామం ఏర్పడింది. 1980-81 మధ్య కాలంలో సాగుబడిని అనుభవంగా పరిగణనలోకి తీసుకున్న అప్పటి కలెక్టర్, గట్టువారీ సర్వే నిర్వహించి అనుభవదారులకు రఫ్ పట్టాలను మంజూరు చేశారు. ఆ పట్టాల ఆధారంగానే భూమి హక్కుదారులుగా ఉండేవారు. ఈక్రమంలోనే క్రయవిక్రయాలు కూడా పెద్దఎత్తున జరిగాయి. ఈనేపథ్యంలోనే శెట్టిపల్లె భూముల్లోని 82.67 ఎకరాలను రైల్వే శాఖ తిరుపతి క్యారేజ్ రిపేర్ షాప్ నిర్మాణం కోసం రైతులకు పరిహారం చెల్లించి మరీ భూములు తీసుకుంది. అంతేకాకుండా భూములు కోల్పోయిన ప్రతి ఇంటికి సీఆర్ఎస్‌లో ఒక ఉద్యోగాన్ని కల్పించింది. అయితే 2007-08లో అప్పటి జాయింట్ కలెక్టర్ శెట్టిపల్లె భూముల్లో సర్వే నిర్వహించి, వీటిని ప్రభుత్వ భూములుగా రికార్డుల్లోకి ఎక్కించారు. ఇక్కడి నుంచీ వివాదం మొదలైంది. దీనిపై పలువురు హైకోర్టుకు వెళ్లినా కూడా లాభం లేకుండా పోయింది. అమ్మే, కొనే హక్కులు కోల్పోయిన ఈ భూ యజమానులు ఆందోళనతోనే గడుపుతున్నారు. తాజాగా 270 ఎకరాల భూమిని 348 మంది రైతుల అనుభవంలోనూ, తక్కిన భూమి ఇళ్లు, లేఅవుట్ల రూపంలో 2448మంది అనుభవంలోనూ ఉన్నట్టు గుర్తించారు. ఈ విలువైన భూములను అభివృద్ధి పరచి లేఅవుట్లు వేసి రోడ్లు ఇతర మౌలిక వసతులు కల్పించాలన్నది ఆలోచన. వ్యవసాయ భూములైతే రైతులకు 30శాతం కార్పొరేషన్‌కి 70 శాతం వంతున, కమర్షియల్ అయితే 40/60 విధానంలో పంపిణీ చేస్తామని చెప్పి ఖాళీ ప్రొసీడింగ్స్ ప్రజల చేతుల్లో పెట్టారు. ఈ విధంగా చేయడం వల్ల కార్పొరేషన్‌కి 120 నుంచి 150 ఎకరాలు లభిస్తుందని భూమన తండ్రీకొడుకులు అభిప్రాయపడ్డారు. చివరికి శెట్టిపల్లి ప్రజలకు ఉత్త చేతులు చూపించేశారు.

తుడా స్కెచ్ వేసింది

2020 జనవరి: శెట్టిపల్లి వద్ద అద్భుతమైన టౌన్‌షిప్ నిర్మాణం చేపట్టాలని తుడా ఛైర్మన్‌గా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి యోచన చేసి కార్యచరణ మొదలు పెట్టారు. శెట్టిపల్లి భూములకు సంబంధించి 2020 జనవరిలో ఒక నోటిఫికేషన్ జారీ చేశారు. పాత, కొత్త రికార్డుల ఆధారంగా ఉన్న 636 ఎకరాల భూములు తదితర వివరాలను పొందుపరిచారు. భూ సేకరణ ద్వారా సీఆర్ఎస్‌కు కేటాయించిన భూములు మినహాయించి, ప్రభుత్వ భూములు, కుంటపోరంబోకు, కాలువ పోరంబోకు, రస్తా పోరంబోకు స్థలాలను ప్రకటనలో పొందుపరిచారు. అభ్యంతరాలు ఉంటే స్వీకరించేందుకు తుడా కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను అందుబాటులో ఉంచారు. తుడా, రెవెన్యూ అధికారులతో కూడిన ఓ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. అవసరమైతే తుడా ఆస్తులను సైతం బ్యాంకుల్లో తనఖా పెట్టైనా రుణం తెచ్చి టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. డిప్యూటీ కలెక్టర్ పర్యవేక్షణలో శెట్టిపల్లి భూముల విషయంలో అనుభవం కలిగిన విశ్రాంత తహసీల్దారులను నియమించారు. అయితే కోవిడ్ తర్వాత ఇదంతా మూలన పడింది.

కార్పొరేషన్ కాజేయాలనుకుంది

"మూడు నెలల్లో మీరు అనుకున్న దానికన్నా ఎక్కువే చేస్తాం.

● తన నివాసంలో శెట్టిపల్లి భూ బాధితులతో 2019 జూన్ 24న ఎమ్మెల్యే కరుణాకర్‌రెడ్డి

ఆ తర్వాత శెట్టిపల్లి కథ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సారథ్యంలో మున్సిపాల్టీకి చేరింది. ఆగమేఘాలపై శెట్టిపల్లి ఫైళ్లు పరుగులు పెట్టాయి.

1-8-2021: కౌన్సిల్ సమావేశంలో శెట్టిపల్లి విలీనం అంశాన్ని ప్రస్తావించారు. తనకు మాటమాత్రం అయినా చెప్పకుండానే అజెండాలోకి ఎలా చేర్చారని మేయర్ శిరీష అసంతృప్తి వ్యక్తం చేశారు. శెట్టిపల్లిను తుడాకు అప్పగిస్తే లేఅవుట్లు వేసుకుని డబ్బుచేసుకుంటుంది తప్ప మరో కార్యక్రమం ఉండదని డిప్యూటీ మేయర్ అభినయరెడ్డి వ్యాఖ్యానించారు. విలీనం చేసుకుంటే ఆస్తులు పెద్దగాలేని కార్పొరేషన్‌కు దాదాపు 120 ఎకరాలు ఆస్తులుగా రానున్నాయని విలీనం వెనుక రహస్యం చెప్పారు.

28-9-2021: శెట్టిపల్లి భూముల సమస్యలపై ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి రెవెన్యూ అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. శెట్టిపల్లిని కార్పొరేషన్‌లో విలీనం చేయాలంటూ పంచాయితీ తీర్మానం కావాలని సూచన చేశారు.

29-9-2021: శెట్టిపల్లి పంచాయితీలోని శెట్టిపల్లి, శెట్టిపల్లి హరిజనవాడ, సీఆర్ఎస్ క్వార్టర్స్, ఉప్పరపాళెం, వినాయకనగర్‌లను కార్పొరేషన్‌లో విలీనం చేయాలని కోరుతూ పంచాయితీ తీర్మానం చేసింది. అదేరోజు కమిషనర్‌కు ఆ కాపీ చేరింది.

30-9-2021: జరగబోయే కౌన్సిల్ సమావేశపు అజెండాలో శెట్టిపల్లిని విలీనం చేసుకునే అంశాన్ని చేర్చారు.

3-12-2021: తిరుపతి పర్యటనకు వచ్చిన సీఎం జగన్మోహన్ రెడ్డిని శెట్టిపల్లి బాధితులు కలిసి తమ గోడు చెప్పుకున్నారు. ఆయన పక్కనే ఉన్న కలెక్టర్‌ను పిలిచి సమస్యను పరిష్కరించండి అని చెప్పి వెళ్లిపోయారు.


27-9-2022: తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి వచ్చిన సీఎం జగన్ రెడ్డిని నానాతంటాలు పడి మరోసారి శెట్టిపల్లె ప్రజలు కలిశారు. సేమ్ సీన్ రిపీట్. పక్కనే ఉన్న కలెక్టర్‌కు అప్పగించి వెళ్లిపోయారు.

2-11-2023: శెట్టిపల్లి సమస్యలను పరిష్కరించేశామని ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి పెద్ద మీటింగ్ పెట్టారు.

3-11-2023: కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఇతర రెవెన్యూ అధికారులు, మేయర్, డిప్యూటీ మేయర్ల సమక్షంలో ప్రొసీడింగ్స్ చేతిలో పెట్టారు. శెట్టిపల్లికి నిజమైన పండుగ వచ్చిందని గొప్పలు చెప్పుకున్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌కు వచ్చే భూభాగంతో సాఫ్ట్‌వేర్ కంపెనీలను తీసుకొస్తామన్నారు. **8-2-2024:** ప్రొసీడింగ్స్ కాపీలు అందుకున్నవారు స్థలంలోకి దిగితే రెవెన్యూవాళ్లు అడ్డుకుని వెనక్కి పంపుతున్నారు.

మాట మోసం చేశారు

శెట్టిపల్లి పంచాయితీ ఎన్నికలు జరిగి పదవుల్లోకి వచ్చిన ఏడాది కాలంలోనే తమ భూ సమస్య పరిష్కారం అవుతుందన్న వైసీపీ నేతల మాటలతో పంచాయితీని కార్పొరేషన్లో విలీనం చేసేందుకు సిద్ధమయ్యారు. వారి మాటలు నమ్మి సర్పంచ్ పదవులు త్యాగం చేసి రాత్రికి రాత్రే తీర్మానాలు చేసి కార్పొరేషన్లో కలిసిపోయారు. సెటిల్ చేసే క్రతువును దిగ్విజయంగా పూర్తిచేశామంటూ రైతులకు ఖాళీ ప్రొసీడింగ్స్ చేతిలో పెట్టారు. అందులో లేఅవుట్ వేసి, ప్లాట్ నెంబర్లు నమోదు చేయలేదు. అభివృద్ధి మాటలు అమలు కాకపోవడంతో నేతలను అడిగితే, లేఅవుట్ డెవలప్మెంట్ కోసం బెంగుళూరు వాళ్లకు కాంట్రాక్ట్ ఇచ్చామని, ఎన్నికల తర్వాత చేసేస్తామని తాపీగా చెప్పారు. పంచాయితీ పాలకమండలిని కూడా కోల్పోయి, ఊరించి ఉసూరుమనిపించడంతో శెట్టిపల్లి ప్రజలు ఆవేదనతో రగిలిపోతున్నారు.



ఆర్థిక నగరిగా చంద్రబాబు విజన్

2018: శెట్టిపల్లె పంచాయతీ పరిధి తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో ఉండటంతో టీడీపీ నేతలు సుగుణమ్మ, పులివర్తి నానిలు ప్రత్యేక చొరవ తీసుకుని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దశాబ్దాలుగా మగ్గుతున్న ఈ సమస్య పరిష్కారానికి ఒక ప్రణాళికను ప్రభుత్వం ప్రతిపాదించింది. 30 శాతం భూములు రైతులకు, 70 శాతం భూములు ప్రభుత్వం తీసుకుని ఈప్రాంతాన్ని అభివృద్ధి చేసేలా నిర్ణయం తీసుకున్నారు. 2018లోనే కేబినెట్‌లో ఆమోదముద్ర కూడా పడింది. శెట్టిపల్లిని ఎకనమిక్ జోన్‌గా తీర్చిదిద్దడం చంద్రబాబు ఆలోచన. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయనేది ఆయన భావన. ఉన్న భూముల్లో ఓ వైపు ఆర్థిక నగరం, మరోవైపు రైతులకు, ప్లాట్ల కొనుగోలు దారులకు భూములు, స్థలాలను అందించేలా ప్లాన్ చేశారు. ఆర్థిక నగరంగా తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని శెట్టిపల్లి ప్రజలు కూడా సంతోషపడ్డారు. అయితే 2019 ఎన్నికల్లో తెలుగుదేశం ఓడిపోవడంతో దీనిని వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది.

అసలు 2012లోనే ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబునాయుడు శెట్టిపల్లెలో పర్యటించారు. భూముల సమస్యను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. 2018-19లో అప్పటి కలెక్టర్ ప్రద్యుమ్న చొరవతో రెవెన్యూ బృందాన్ని ఏర్పాటు చేసి దాదాపు రెండు నెలల పాటు సర్వే నిర్వహించి రికార్డులను సేకరించారు. శెట్టిపల్లె గ్రామం, భూముల్లో పర్యటించి రైతులు, ప్లాట్ల కొనుగోలుదారులతో సమావేశాలు ఏర్పాటు చేసి భూముల వాస్తవ పరిస్థితులను వారికి వివరించారు.

బాబు కోసం నేను సైతం



తాను ఉద్యోగిగా స్థిరపడటానికి బాటలు వేసిన ప్రియతమ నేత నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యే దాకా నల్లచొక్కానే ధరిస్తానని ప్రతినబూనాడో యువకుడు. ఏర్పేడు మండలం గోవిందరం గ్రామానికి చెందిన అబ్బూరి రమేష్ 2012 నుంచి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ సంస్థలో పనిచేస్తున్నాడు. మంచి శాలరీ ప్యాకేజీనే తీసుకుంటున్నాడు. చంద్రబాబునాయుడు ముందుచూపుతో సాఫ్ట్‌వేర్ రంగాన్ని ప్రోత్సహించడం వల్లే తనకు ఉద్యోగం వచ్చిందని రమేష్ బలంగా నమ్ముతాడు. అందుకే ఆయనంటే అమితాభిమానం. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని భావిస్తూ తాజాగా ప్రచారం రంగంలోకి దిగాడు. సాఫ్ట్‌వేర్ కొలువుకు సెలవుపెట్టి మరీ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నాడు. ఆయన మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే వరకు తాను నల్ల చొక్కానే ధరిస్తానంటున్నాడు.

- ఏర్పేడు

మీటింగ్‌కు వస్తే చికెన్ మీల్స్...

చంద్రగిరి మండలంలో మీటింగులకు జన సమీకరణ నాయకులకు తలనొప్పిగా మారింది. మొక్కుబడిగా కాసేపు కూర్చుని వెళితే చాలని బతిమలాడినా జనం ముఖం చాటేస్తున్నారు. దీంతో .చికెన్ భోజనం ఉంది.. రండంటూ ఆఫర్ ఇస్తున్నారు. ఎన్నికల సమయం కావడంతో అన్ని రాజకీయ పార్టీల నాయకులు గ్రామాల్లో బల నిరూపణకు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎండలు దంచేస్తుండటంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావడంలేదు. కొంతమంది తటస్థంగా ఉంటూ కనిపించకుండా తిరుగుతున్నారు. ఈక్రమంలోనే తమ నేత ముందు బల నిరూపణకు చిన్నాచితకా నాయకులు నానా తంటాలు పడుతున్నారు. మహిళలకు కూల్ డ్రింక్స్, పురుషులకు మద్యం ఆఫర్ చేస్తున్నారు. అంతేకాదండోయ్ చికెన్ భోజనం కూడా ఉందని నోరూరిస్తున్నారు. ఇంట్లో జరిగే శుభకార్యాలకు పిలిచినట్లుగా గ్రామ నాయకులు ఆహ్వానిస్తున్నారు. ఇన్ని ఆఫర్లు ఇస్తున్నా మీటింగులకు జన స్పందన అంతంతమాత్రంగానే ఉంటోందని నాయకులు ముఖం చిట్లిస్తున్నారు.

- చంద్రగిరి



ఇక్కడ వెలవెల.. అక్కడ కళకళ

ఏపీ, కర్ణాటక సరిహద్దుల్లో పెట్రోల్ బంకుల పరిస్థితిదీ


వి.కోటలో మూతపడిన హెచ్‌పీ పెట్రోల్ బంకు


దాసార్లపల్లె వద్ద వాహనాలు రాక..

ఈ రేట్లు చూస్తే చాలు పెట్రోల్, డీజిల్‌పై మన రాష్ట్రంలో జగనన్న వ్యాట్ బాదుడు ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవడానికి. దీని ప్రభావం ఏపీ, కర్ణాటక సరిహద్దుల్లోని పెట్రోల్ బంకులపై పడింది. మిగతా చోట్ల ఎంత ధరయినా వాహనదారులు పెట్రోల్, డీజిల్‌ను వాడుకోక తప్పదు. కానీ.. వి.కోటలో మాత్రం పరిస్థితి భిన్నం. వి.కోటకు కూతవేటు దూరంలో కర్ణాటక సరిహద్దు.. దాని వెంబడే పెట్రోల్ బంకులు ఉన్నాయి. దీంతో వాహనదారులు కిలోమీటరు దూరమైనా సరే అక్కడకు వెళ్లి ట్యాంకులు ఫుల్ చేసుకుని వస్తున్నారు. మరోవైపు కర్ణాటక- మన జిల్లా మధ్య రాకపోకలు సాగించే వాహనదారులూ ఆ రాష్ట్ర సరిహద్దులోనే ట్యాంకులు ఫుల్ చేయించేస్తున్నారు. దీంతో కర్ణాటక సరిహద్దులోని పెట్రోల్ బంకుల్లో ట్యాంకులు ఖాళీ అయిపోతుంటే.. మన దగ్గర వారాలైనా ట్యాంకర్ ఖాళీ కావడంలేదు. ఐదేళ్లుగా ఇదే పరిస్థితి. ఇక, రెండేళ్ల కిందట కుప్పం రోడ్డులోని హెచ్‌పీ పెట్రోల్ బంకుకు నిర్వహణ వ్యయం కూడా రావడంలేదని మూసేశారు. మిగిలి మూడు బంకుల్లో నామమాత్రంగా వ్యాపారం జరుగుతోంది. అదే సరిహద్దుకు ఆనుకుని.. కర్ణాటకలో ఐదేళ్ల కిందట ఒకే పెట్రోల్ బంకు ఉండేది. అక్కడ దేశంలోనే అత్యధిక లీటర్ల అమ్మకం జరుగుతోందని రివార్డులు పొందారు. గత రెండేళ్లలో మరో నాలుగు పెట్రోల్ బంకులు నెలకొల్పారు. తాజాగా మరొకటి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. రెండు రాష్ట్రాల మధ్య ధరల్లో రెండు, మూడు రూపాయలుంటే పర్వాలేదు కానీ.. రూ.13కిపైగా ఉంటే ఎలాగని వినియోగదారులు అంటున్నారు.

- వి.కోట

జగనన్న బాదుడు ఎఫెక్ట్



ఏపీ(రూ.ల్లో)		కర్ణాటక	తేడా
పెట్రోల్:	111.33	100.02	11.30
డీజల్	98.99	86.10	13.80


కర్ణాటకలో వాహనాలతో కిక్కిరిసిన పెట్రోల్ బంకు


పొంతనపల్లె వద్ద ప్రారంభానికి సిద్ధమైన మరో పెట్రోల్ బంకు

జన చైతన్యం



నేను దిగుబడి బాగిస్తా




పూతలపట్టు టీడీపీ అభ్యర్థి మురళీమోహన్ ఆదివారం ఐరాల మండలం సంతగేటు వద్ద ప్రచారం చేశారు. వైసీపీ సానుభూతిపరుడైన పద్మనాభరెడ్డి వద్దకెళ్లి ప్రచారంలో భాగంగా కాసేపు ముచ్చటించారు. మామిడి పంటకు ఎన్నిసార్లు మందు కొట్టావని అడగ్గా.. ఐదుసార్లు కొట్టినా దిగుబడి లేదని ఆ రైతు వాపోయారు. 'ఈసారి మురళీ అనే మందును కొట్టి చూడు. బాగా దిగుబడి వస్తుంది' అని ఆ రైతుతో అన్నారు. ఇలా విభిన్నంగా ఓట్లను అడుగుతూ.. ఓటర్లను ఆకట్టుకుంటూ ముందుకు సాగుతున్నారాయన.

- ఐరాల

పింఛన్లకు జగన్ కోత

పింఛను పేరిట గొప్పలు చెప్పే జగన్ ప్రభుత్వం వంచనకు పాల్పడింది. రకరకాల నిబంధనల పేరిట కోతలు విధిస్తూ నిలువునా మోసం చేసింది. ఐదేళ్ల పాలనలో జిల్లాలో దాదాపు 15 వేల నుంచి 25 వేల వరకూ పింఛన్ల సంఖ్యను కుదించింది. 3 లక్షల మందికి పైగా పింఛనుదారులుండగా కోతల అనంతరం 2,74,146 మంది మాత్రమే ఉన్నారు.

- చిత్తూరు (సెంట్రల్)




జగన్ పెంచింది:
నాలుగు విడతల్లో రూ.వెయ్యి

మళ్లీ అధికారంలోకి వస్తే పెంచేది: 2028, 2029లో రూ.250 వంతున రూ.500

చంద్రబాబు పెంచింది:
రూ.200 నుంచి రూ.2000కు

మళ్లీ అధికారంలోకి వస్తే పెన్షన్:
రూ.4000 (ఏప్రిల్ నుంచే అమల్లోకి)



తనిఖీల పేరుతో పింఛన్లు కోత..

తొలి మూడేళ్లలో జగన్ ప్రభుత్వం పారదర్శకత పేరుతో సామాజిక తనిఖీలు చేపట్టి కొంతమేర లబ్ధిదారులను తొలగించింది. ఎన్నికలు దగ్గర పడుతున్నాయని ప్రస్తుతానికి ఈ తనిఖీలను ఆపింది. అర్హులు, అనర్హుల జాబితాను కూడా సచివాలయాల్లో ప్రదర్శించలేదు.

- బియ్యం కార్డు ఆధారంగా కుటుంబంలో ఒకరికే పింఛన్ పరిమితం చేసింది.
- దివ్యాంగులు, డప్పు కళాకారులు, హిజ్రాలకు జగన్ పైసా కూడా పెంచలేదు. ఒంటరి మహిళల వయోపరిమితిని 50 ఏళ్లకు పెంచి అనేక మందిని పింఛన్లకు దూరం చేసింది.

షరతులు వర్తిస్తాయి

పింఛనుదారుల సంఖ్య తగ్గించేందుకు జగన్ ప్రభుత్వం సవాలక్ష షరతులు విధించింది. కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉన్నా, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఉన్నా, 300 యూనిట్ల విద్యుత్ వాడినా, పట్టణాల్లో 750 చదరపు అడుగుల స్థలం ఉన్నా, ఆదాయపు పన్ను చెల్లిస్తున్నా.. నాలుగు చక్రాల వాహనం ఉన్నా, వ్యవసాయ భూమి ఉన్నా పింఛను చెల్లించేది లేదంటూ తేల్చేసింది. హెచ్‌ఐవీ రోగులకు సైతం సామాజిక భద్రత పింఛను దూరం చేసింది.

నెల దాటితే పింఛన్ రాదు.?

ఏ నెల పింఛన్ ఆ నెలలోనే తీసుకోకపోతే మరుసటి నెల ఇవ్వకూడదనే నిబంధన పెట్టింది. ఇతర ప్రాంతాలకు వెళ్లిన కూలీలు, అత్యవసర పనులు, శుభ కార్యాలకు వెళ్ళేవారు, ఆరోగ్య సమస్యలున్నవారు ఈ నిబంధనల కారణంగా ఇబ్బందులు పడుతున్నారు.

జులైలో 7 వేల పింఛన్లు కట్

2022 జులైలో జగన్ సర్కార్ పింఛన్ కోతలకు శ్రీకారం చుట్టింది. ఏకంగా ఏడు వేల పింఛన్లకు కోత పెట్టింది. జనవరి నుంచి జూన్ వరకు కొత్త పెన్షన్ల కోసం 18 వేల దరఖాస్తులు రాగా, 14,307 మందికి మంజూరు చేసింది. 3693 మందికి కోత పెట్టింది. అప్పటికి జిల్లాలో 2,50,594 మంది పింఛనుదారులుండేవారు. కొత్తవి కలుపుకొని 2,64,901 పింఛన్లు ఇవ్వాలి. కొత్తగా పింఛన్లలోనూ 3347 మందిని తొలగించి చివరకు 2,61,554 పింఛన్లు మాత్రమే ఇచ్చింది. దరఖాస్తు చేసుకున్న వారిలో 3693 మందికి, మంజూరు చేసిన వాటిలో 3347 పింఛన్లు మొత్తంగా 7,040 పింఛన్లకు కోత పెట్టింది.

తెలుగుదేశం హయాంలో ఇలా..



కుటుంబంలో ఇద్దరు వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలున్నా గత తెలుగుదేశం ప్రభుత్వం పింఛన్ ఇచ్చేంది.

- దివ్యాంగుల పింఛన్‌ను వైకల్య శాతం ఆధారంగా రూ.500 నుంచి రూ.3 వేలు పెంచింది. డప్పు కళాకారులు, హిజ్రాలకు నెలకు రూ.3వేల చొప్పున అందజేసింది.
- పట్టణాల్లో 35 ఏళ్ళు, గ్రామాల్లో 30 ఏళ్ళు దాటిన ఒంటరి మహిళలకు పింఛన్లు మంజూరు చేసింది.
- చేనేత, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులకు పింఛను వస్తుండేది.
- ఏ కారణంగానైనా ఒకటి, రెండు నెలల పాటు పింఛన్ తీసుకోకున్నా తర్వాతి నెలలో బకాయితో కలిపి చెల్లించేది.
- 2014లో రూ.200 ఉన్న పింఛన్ మొత్తాన్ని 2019 నాటికి రూ.2 వేలకు పెంచింది. ఐదేళ్లలో 10 రెట్లు పెరిగింది.

మీకు తెలుసా?

చూపుడు వేలు లేకుంటే..?



పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ఎడమచేతి చూపుడు వేలికి సిరా గుర్తు వేస్తారు. రెండోసారి ఓటెయ్యడానికి రాకుండా ఉండేందుకు ఇలా చేస్తారని అందరికీ తెలిసిందే. మరి.. ఎవరికైనా చూపుడు వేలు లేకుంటే పరిస్థితి ఏమిటనేది చాలామందికి తెలియదు. అలాంటి వారికి మధ్య వేలికి సిరాగుర్తు వేయవచ్చు. ఆ వేలూ లేకుంటే ఉంగరం వేలు, లేదా చిటికెన వేలు.. చివరకు నాలుగు వేళ్లూ లేకుంటే బొటన వేలుకు సిరా గుర్తుపెడతారు. ఒకవేళ ఎడమ చెయ్యే లేకుంటే.. ఆ ఓటర్లకు కుడిచేతికి ఇదే క్రమంలో సిరాగుర్తు వేస్తారు. రెండు చేతులకూ వేళ్లు లేకపోతే ఎలా? అనే ప్రశ్న రావచ్చు. అలాంటి వారికి వేళ్ల మొదలు లేదా మధ్య భాగం లేదా చేతిపై గుర్తువేస్తారు. భుజాలవరకు చేతులు లేని ఓటర్లకు ఎడమ చెంపపై సిరా గుర్తు పెడతారు.

- చిత్తూరు కలెక్టరేట్

నోట్ దిస్ పాయింట్

మీ ఓటు తెలుసుకోండి

మీకు ఓటు ఉందో లేదో తెలుసుకోవాలంటే.. గూగుల్‌లో ceo ap erolls.ap.gov.in/ name search చేయండి. ఏపీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ పేరుతో ఉన్న పేజీ ఓపెన్ అవుతుంది. ఇందులో మీ జిల్లా, నియోజకవర్గాన్ని ఎంచుకోవాలి. హౌస్ నెంబర్ ఆప్షన్‌లో మీ ఇంటి డోర్ నెంబరు నమోదు చేయాలి. క్యాప్చా ఎంటర్ చేసి సెర్చ్ కొడితే చాలు. ఆ ఇంటి నెంబరులో మొత్తం ఎంతమంది ఓటర్లు ఉన్నారు. వారి పేర్లు, వయస్సు,



ఓటరు కార్డు నెంబరు, వారి పోలింగ్ కేంద్రం నెంబరు, వారి ఓటరు వరుస నెంబరు వంటి వివరాలన్నీ వచ్చేస్తాయి. మీ ఓటు కూడా కనిపిస్తుంది. మీ కుటుంబ సభ్యుల పేర్లు కాకుండా అపరిచితుల పేర్లుంటే అవి దొంగఓట్లని లెక్క. ఒకవేళ ఆ డోర్‌నెంబరులో గతంలో మీ ఓటు ఉండి, ఇప్పుడు కనిపించకపోతే మీ ఓటు పోయినట్లే.

- చిత్తూరు కలెక్టరేట్

తమిళ నేస్తం

చిత్తూరు చరిత్ర

తెలుగు, తమిళ భాషలు మిళితమై.. భిన్న సంస్కృతులు, సంప్రదాయాల మేళవింపు చిత్తూరు నియోజకవర్గ ప్రజల జీవన శైలి. పాడి, కోళ్ల పరిశ్రమలతో పాటు మామిడిపై ఎక్కువమంది ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. తమిళ ప్రభావం అధికంగా ఉన్న ఈ నియోజకవర్గంలో గతంలో డీఎంకే, ఏఐఏడీఎంకే పార్టీల తరఫున అభ్యర్థులు పోటీ చేయడం విశేషం. నాడు సినీ నటుడు ఎంజీ రామచంద్రన్ చిత్తూరులో ప్రచారం చేయడం ఇక్కడి తమిళ ప్రభావాన్ని చాటుతుంది. కాగా 1989, 1994, 1999 ఎన్నికల్లో సీకేబాబు వరుసగా విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టారు. జిల్లా కేంద్రమైనా ఇక్కడి నుంచి ఇప్పటివరకూ ఎవరినీ మంత్రి పదవి వరించలేదు.

ఎమ్మెల్యేలు

- 1952- పి. చిన్నమ్మరెడ్డి- కాంగ్రెస్
- 1953- సింగారం- కృషికర్‌లోక్ పార్టీ
- 1955- పి. చిన్నమ్మరెడ్డి- కాంగ్రెస్
- 1962- సీడీ నాయుడు (స్వతంత్రపార్టీ)
- 1967- డి. ఆంజనేయుడు నాయుడు- కాంగ్రెస్
- 1972- డి. ఆంజనేయుడు నాయుడు- కాంగ్రెస్
- 1978- ఎన్‌పీ వెంకటేశ్వరచౌదరి- జనతా పార్టీ
- 1983- ఎన్‌పీ ఝాన్సీలక్ష్మి- టీడీపీ
- 1985- ఆర్. గోపినాథ్- కాంగ్రెస్
- 1989- సీకే బాబు (ఇండిపెండెంట్)
- 1994- సీబీకేబాబు- కాంగ్రెస్
- 1999- సీకేబాబు- కాంగ్రెస్
- 2004- ఏఎస్ మనోహర్- టీడీపీ
- 2009- సీకేబాబు- కాంగ్రెస్
- 2014- డీఏ సత్యప్రభ- టీడీపీ
- 2019- ఆరణి శ్రీనివాసులు- వైసీపీ



- చిత్తూరు


నియోజకవర్గ పరిధి: చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్, గుడిపాల మండలాలు

నియోజకవర్గ ఆవిర్భావం: 1952

ఎన్నికలు జరిగివి: 16 సార్లు

- ఓటర్ల సంఖ్య: 201741, ● పురుషులు: 97765
- మహిళలు: 103023, ● ఇతరులు: 34 మంది
- సర్వీసు ఓటర్లు: 868, ● ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు:51

ఇన్‌సైడ్



ఐదేళ్ల పాలనలో మీకు ఏమీ చేయలేకపోయాం. నిజమే. ఇప్పుడు ఎన్నికల వేళ మీరు అసంతృప్తితో కూచుంటే పార్టీ కుదేలవుతుంది. మీకు ఏదో ఒక సాయం అందేలా చూస్తా. జనంలోకి వెళ్లి పనిచేయండి. మీలో మీరు విభేదాలతో కొట్టుకుని రచ్చకు ఎక్కొద్దు.

- కుప్పం, శాంతిపురంలలో ఇటీవల జరిగిన గ్రామ స్థాయి ప్రజాప్రతినిధుల సమావేశంలో కొందరిని విడిగా పిలిపించి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేసిన బుజ్జగింపుల సారాంశమిది.

మీలో మీరు ఇంకా కొట్లాడుకుంటూనే ఉంటారా? పార్టీకోసం పనిచేయరా? ఎందుకు నా కడుపు కాలస్తారు? పని చేస్తే చెయ్యండి. లేకపోతే ఇంట్లో పడుకోండి. నాకుమాత్రం ద్రోహం చేయకండి.

- శాంతిపురంలో శనివారం సాయంత్రం ఆ మండల అధికార పార్టీ సర్పంచులు, ఎంపీటీసీల సమావేశంలో అభ్యర్థి భరత్ చేసిన వ్యాఖ్యలివి.

వైసీపీలో నైరాశ్యం!

బుజ్జగింపులు.. 'పంపిణీలు' ఫలించక అసహనం

సొంత పార్టీ నేతలకు పది రోజుల కిందట మంత్రి పెద్దిరెడ్డి బుజ్జగింపులు.. ఒక రోజు కిందట అభ్యర్థి భరత్ అసహనం.. వీటిమధ్య ఏం జరిగింది? వైసీపీ ఎందుకంత నైరాశ్యంలోకి వెళ్లిపోతోంది? దీని వెనుక పరిణామాలను పరిశీలిస్తే..

- కుప్పం

కుప్పంలో వైసీపీ పైకి ఎన్ని మాటలు చెబుతున్నా పార్టీ పరిస్థితి తీసికట్టుగా మారుతోందన్నది నిజం. ఈనెల 24న భరత్ నామినేషన్ సందర్భంగా ర్యాలీ అనుకున్నంతగా సక్సెస్ కాకపోవడంపై ఆ పార్టీలో అంతర్మథనం జరుగుతోంది. నిజానికి ఫిబ్రవరి 26న సీఎం జగన్ కుప్పం పర్యటనకు ముందే వైసీపీలో లుకలుకలు బయటకు వచ్చాయి. తమకు గుర్తింపు లేకపోవడం, ఒక్క అభివృద్ధి పనీ జరగకపోవడం, ఎన్ని ఆందోళనలు చేసినా నీటి ట్యాంకర్లకు బిల్లులు ఇవ్వకపోవడంతో అధికార పార్టీ నేతలు తీవ్ర అసహనంతో ఉన్నారు. సీఎం సభను బహిష్కరించాలని అప్పట్లో అంతర్గత సమావేశాలు నిర్వహించారు. అప్పట్లో వారిని మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్సీ భరత్ వారిని బుజ్జగించారు. నీటి బిల్లులు విడుదలయ్యాయి. ఇక, ఆర్థిక సాయం కూడా భారీగా చేశాకనే వారంతా చల్లబడినట్లు అప్పట్లో ప్రచారమైంది. సీఎం సభకు వీరంతా హాజరైనా.. అనుకున్నంతగా జన సమీకరణ జరగలేదు. దీనికి గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడమే కారణమని తేల్చారు. తర్వాత దశలో వారిని బుజ్జగించే ప్రయత్నాలు మొదలయ్యాయి.

ఐదేళ్లలో మాకేం ఒరిగింది?

అధికారంలోకి వచ్చాక తమకు ఏమి ఒరిగిందంటూ నెల క్రితం ఎమ్మెల్సీ భరత్ నిర్వహించిన సమావేశంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు నిలదీశారు. ఈ క్రమంలో పది రోజుల కిందట మంత్రి పెద్దిరెడ్డి నిర్వహించిన సమావేశాల్లోనూ తమ అసంతృప్తిని వ్యక్తపరచడంలో వీళ్లు ఏమాత్రం తగ్గలేదు. మరీ తీవ్ర అసంతృప్తిలో ఉన్న గ్రామస్థాయి ప్రజాప్రతినిధులను పిలిపించి పెద్దిరెడ్డి బుజ్జగించాల్సి వచ్చింది. ఆ తర్వాత వీళ్లనూ సంతృప్తిపరిచారు. అయినా, ప్రచారాల్లో వారి ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంటోంది. శనివారం జరిగిన సమావేశంలో వారిపై భరత్ మండిపడటానికి కారణం ఇదేనని తెలిసింది. చేయాల్సిన 'సాయం' చేసినా దూరంగా ఉండిపోవడం ఏమిటని నిలదీసినట్లు సమాచారం. ఈ పరిణామాలతో భరత్ పూర్తిగా నైరాశ్యంలోకి జారిపోయినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఏం చేశారని వెళ్లాలి?

'ఈ ఐదేళ్లలో గ్రామాలలో ఒక్క అభివృద్ధి పనీ జరగలేదు. జనమేమో ఇంటి ముందు రోడ్డు ఏమైందని, కాలువ ఎందుకు కట్టలేదని నిలదీస్తున్నారు. పంచాయతీల స్థాయిలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి నేతల భూ కబ్జాలు, అమాయకులపై దాడులు, దౌర్జన్యాలు ఎక్కువయ్యాయి. ఇలాంటప్పుడు ఓట్ల కోసం జనం ముందుకు ఏ నాయకులైనా ఏ ముఖం పెట్టుకుని వెళతారు' అని వైసీపీ కార్యకర్తలే అంటున్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

జగన్ మేనిఫెస్టో మోసపూరితం: టీడీపీ


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ బీసీ నాయకులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 28: వైసీపీ అధినేత జగన్ ప్రకటించిన మేనిఫెస్టో ఆసాంతం మోసపూరితంగా ఉందని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఉమేష్ రావు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం బీసీ విభాగం నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమేష్ రావు మాట్లాడుతూ... జగన్ అధికార వాంఛతో గత ఎన్నికల సమయంలో మోసపూరితమైన మేనిఫెస్టోను ప్రకటించారని చెప్పారు. అందుకు ఏమాత్రం తీసిపోకుండా మరిన్ని అబద్ధాలతో నిండిన కొత్త మేనిఫెస్టోను మళ్లీ ప్రకటించడం జగన్ మోసపూరిత నైజానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలోని బీసీ వర్గాలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం ఉన్న రిజర్వేషన్లను 10శాతం తగ్గించి బీసీలకు వివిధ పదవులను దూరం చేసిన మోసగాడు జగన్ అని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించుకున్న 600 మంది సలహాదారుల్లో కనీసం ఐదుగురు బీసీలకు అవకాశం కల్పించకపోవం జగన్ బీసీ వ్యతిరేక ఆలోచనకు అద్దం పడుతోందన్నారు. వివిధ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేశానని గొప్పలు చెప్పుకొని, వాటికి నిధులు లేకుండా చేశారని, బీసీ సబ్ ప్లాన్ నిధులను కూడా దారి మళ్లించి అగ్రవర్ణాలకు దోచిపెట్టిన జగన్ బీసీల ద్రోహి అని ఉమేష్ ఆరోపించారు. వైసీపీ పాలనలో బీసీల ప్రాణాలకు దిక్కు, బద్రత లేకుండా పోయిందన్నారు. చంద్రబాబు గొప్ప మనస్సుతో బీసీ రక్షణ చట్టం ప్రకటించడం ఎంతో సంతోషకరం అన్నారు. వేచ్చే బీసీ ప్రజంతా టీడీపీని ఆదరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీమాల భాస్కర్ ముదిరాజ్, చిల్లకూరు మణి తదితరులు పాల్గొన్నారు.

దళిత ద్రోహి జగన్


సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్వరరావు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 28: వైసీపీ అధినేత జగన్ దళితులను అన్నివిధాలా అణగదొక్కిన ద్రోహి అని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది పాలేటి మహేశ్వరరావు మండిపడ్డారు. ఆదివారం ఆయన శ్రీకాళహస్తిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వచ్చాక నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలంటూ కపట ప్రేమ చూపిన జగన్ వారి జీవితాలను నిర్వీర్యం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉన్నత, విదేశీ విద్యను దూరం చేశారని ధ్వజమెత్తారు. ఒక్క జీవోతో 1.40 లక్షల మంది పేదలను బాగా అందుబాటులో ఉన్న పాఠశాల నుంచి తీసేసి విద్యను దూరం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో సగం సీట్లను అమ్ముకునే విధంగా జగన్ జీవో తీసుకొచ్చి పేదలకు అన్యాయం చేశారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీల ఫీజు రియంబర్స్మెంట్లు, స్కాలర్ షిప్‌లో కోత పెట్టిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులను హత్య చేసిన వారిని, దళితులకు శిరోమండనం చేసిన వారికి జగన్ ఎన్నికల్లో సీట్లు కేటాయించడం సిగ్గుచేటన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలపై సాగించిన అరాచకాలను ఎండగడుతూ సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త పర్యటనలు చేస్తున్నామని వివరించారు. సమతా సైనిక్ దళ్ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు, న్యాయవాది పులి పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడును దత్తత తీసుకుంటా: ఎన్ఆర్ఐ

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 28: సత్యవేడు నియోజకవర్గాన్ని దత్తత తీసుకుని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని స్వతంత్ర అభ్యర్థి, ఎన్ఆర్ఐ రమేష్‌బాబు తెలిపారు. మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం బీఎన్‌కండ్రిగలో మీడియాతో మాట్లాడారు. సత్యవేడు నియోజకవర్గం అభివృద్ధిలో వెనకబడి ఉందని, ఉపాధి అవకాశాలు సరిగా లేవన్నారు. రోడ్లు, తాగునీటి తదితర వసతులు కూడా ఇంకా మెరుగు పడలేదన్నారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని రమేష్‌బాబు చెప్పారు. తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వరయ్య, మనోహర్‌నాయుడు, మునిసుబ్బయ్య, ఉషారాణి, రమేష్, సత్యనారాయణ, మునెయ్య, మునిరాజ పాల్గొన్నారు.

బాబుతోనే బంగారు భవిష్యత్తు


ప్రచారం చేస్తున్న పలమాల సుధాకర్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 28: చంద్రబాబుతోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు సాధ్యమని సీరియల్ నిర్మాత, టీడీపీ నాయకుడు పల్లమాల సుధాకర్ అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని చతుర్మాడ వీధుల్లో ఆదివారం కూటమి అభ్యర్థులను గెలిపించాలంటూ ఇంటింటికి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అణగారిపోయిందన్నారు. అలాగే ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత అమలు చేయబోయే సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల ద్వారా ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అన్నదానం

రేణిగుంట, ఏప్రిల్ 28: మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వల్లంశెట్టి శంకర్ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబసభ్యులు, అభిమానులు ఆదివారం రేణిగుంట బస్టాండులో అన్నదానం చేశారు.

బీహార్ యువకుడి ఆత్మహత్య


సనజిత్ కుమార్ మృతదేహం

ఏర్పేడు, ఏప్రిల్ 28: ఏర్పేడు మండలం గోవిందవరం పంచాయతీ జింకలమిట్ట వద్ద ఉన్న స్క్రాప్ కర్మాగారంలో పనిచేసే బీహార్ రాష్ట్రానికి చెందిన సనజిత్‌కుమార్(22) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం సనజిత్ కుమార్ కాలకృత్యాలకు వెళ్లాడు. ఎంత సేపటికీ రాకపోవడంతో అతని అన్న అమిత్‌కుమార్, సహచర కార్మికులు గాలించారు. విమానాశ్రయం గోడపక్కన చెట్టుకు ఉరి వేసుకుని ఉండడాన్ని గుర్తించారు. వెంటనే ఏర్పేడు పోలీసులకు సమాచారం అందించారు. ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రేమ విఫలం కావడంతో కుంగిపోయి ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి అన్న అమిత్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే మధు తిన్నది కక్కిస్తా: సుధీర్‌రెడ్డి


సభలో ఎన్డీఏ కూటమి నేతలతో సుధీర్‌రెడ్డి

రేణిగుంట, ఏప్రిల్ 28: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అక్రమంగా సంపాదించిన సొమ్మంతా కక్కిస్తానని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి రేణిగుంట బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి చొరవతో రేణిగుంట మండలంలో అనేక పరిశ్రమలు నెలకొల్పి స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే మధు పరిశ్రమల వద్ద మమూళ్లు వసూలు చేసి రూ.40కోట్లతో ఇంటిని నిర్మించుకున్నారని ఆరోపించారు. తనను గెలిపిస్తే పరిశ్రమల్లో 33 శాతం ఉద్యోగాలు స్థానికులకు వచ్చేలా చూస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి మాట్లాడుతూ ఐదేళ్ల అరాచక వైసీపీ పాలనకు చరమగీతం పాడాలంటే ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులైన బొజ్జల సుధీర్‌రెడ్డి, వరప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. డాలర్స్ దివాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్టేట్ నుంచి రేణిగుంట కన్వెన్షన్ వరకు యువకులతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ధనంజయయనాయుడు, నాగరాజునాయుడు, ఎంజీరెడ్డి, రాజారాయల్, సెవెన్ హిల్స్ రాము, వెంకటాచలం, నీలకంఠయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కాలగర్భంలో కలిసిపోతుంది

శ్రీకాళహస్తి: అరాచక విధానాలతో వైసీపీ దానంతట అదే కాలగర్భంలో కలిసిపోతుందని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి ఎద్దేవా చేశారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం ముదిరాజ్ సామాజిక వర్గ ప్రజల ఆశీర్వాద సభ జరిగింది. పట్టణానికి ముదిరాజ్ సంఘం నాయకుడు చిట్టెటి చిన్న తన అనుచర వర్గంతో సుధీర్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, టీడీపీ నాయకులు పల్లమాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న కూటమి నేతలు

వైసీపీకి బుద్ధి చెప్పాలి: వరప్రసాదరావు


ప్రచారం నిర్వహిస్తున్న వెలగపల్లి వరప్రసాదరావు

తిరుపతి,(ఉపాధ్యాయనగర్)/సూళ్లూరుపేట, ఏప్రిల్ 28: దళితులంటే వైసీపీకి చాల చిన్నచూపని ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు అన్నారు. ఆదివారం తిరుపతి నగరంలోని కపిలతీర్థంరోడ్డు, అన్నారావుసర్కిల్, ద్వారకానగర్, రామచంద్రానగర్, ప్రశాంతినగర్ ప్రాంతాల్లో కుటుంబసభ్యులు, బీజేపీ నాయకులతో కలసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థులకు ఓట్లువేసి గెలిపించాలంటూ అభ్యర్థించారు. దేశం ఎన్నడూలేనంత అభివృద్ధిని సాధించిందని, సుస్థిరతకు బీజేపీ అధిక ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ఐదేళ్ల జగన్ ప్రభుత్వంలో అభివృద్ధి అన్నది కానరావడం లేదని దాన్ని ప్రశ్నిస్తే తమను చులకనగా చూశారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవస్థలు నిర్వీర్యం అయిపోగా, ఖనిజ సంపద దోపిడీకి గురైందన్నారు. తాను ఈ విషయాల్ని బీజేపీ పెద్దలకు ఫిర్యాదు చేస్తానన్నారు. 27 మంది దళిత ఎమ్మెల్యేలు ఉంటే 23 మంది ఎమ్మెల్యేలను పక్కనపెట్టిన వైసీపీ దళితులపట్ల కపటప్రేమను కనబరుస్తోందని విమర్శించారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశానని మరోసారి అవకాశం ఇస్తే మరింత ముందుకు తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఆయన కుటుంబసభ్యులు కొల్లూరి లక్ష్మి, నవీన్‌గుప్తా, డాక్టర్ ప్రీతి, డాక్టర్ స్ఫూర్తి, అరుణ్‌కళ్యాణ్‌సుందరం, మాజీ ఐపీఎస్ అధికారి శేఖర్, సామాజిక సేవా కార్యకర్త కొపారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


పండ్ల దుకాణం వద్ద ఓట్లు అభ్యర్థిస్తున్న వరప్రసాదరావు

రక్తదానంతో ప్రాణదానం


రక్తదానం చేస్తున్న ఆర్డీవో, కమిషనర్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 28: రక్తదానంతో ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేయవచ్చని శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు అన్నారు. పట్టణంలోని యువతరం సేవా సమితి స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో ఆదివారం రక్తదాన శిబిరం జరిగింది. ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్ రక్తదానం చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాయలసీమ జిల్లాలకు ప్రధానమైన రుయా ఆస్పత్రి బ్లడ్ బ్యాంకులో రక్త నిల్వ కొరత ఏర్పడిందన్నారు. ఈ సమస్యను గుర్తించిన శ్రీకాళహస్తి యువతరం సేవా సమితి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. రక్తదాతలకు అధికారులు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను పంపిణీ చేశారు. యువతరం సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో ఫీల్డ్ అసిస్టెంట్


వైసీపీ ప్రచారంలో ఫీల్డ్ అసిస్టెంట్ సన్నాసయ్య

సత్యవేడు, ఏప్రిల్ 28: అధికార పార్టీ ఎన్నికల ప్రచారంలో ఓ ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొనడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సత్యవేడు మండలంలో ఆదివారం వైసీపీ అభ్యర్థి నూకతోటి రాజేష్ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మల్లవారిపాళెం ఫీల్డ్ అసిస్టెంట్ సన్నాసయ్య ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ అభ్యర్థి తరపున ప్రచారం నిర్వహించడం విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రెండు బైక్‌ల ఢీ: ఒకరికి తీవ్రగాయాలు

కేవీబీపురం, ఏప్రిల్ 28: మండల కేంద్రంలోని రాయపేడు సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఆదివారం దిగువపుత్తూరు గ్రామానికి చెందిన కోదండయ్య ద్విచక్రవాహనంపై కేవీబీపురానికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా వగత్తూరు గ్రామానికి చెందిన అయ్యప్ప ద్విచక్ర వాహనంపై ఎదురుగా వస్తూ ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కోదండయ్యకు కుడికాలు విరిగి తీవ్రగాయాలయ్యాయి. అతడిని 108 వాహనంలో కేవీబీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు.

బృందావనాలకు రంగు మారింది

సత్యవేడు, ఏప్రిల్ 28: పంచాయతీల్లోని బృందావనాలకు(వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంటు) ఎన్నికల కోడ్ ఎఫెక్ట్‌తో రంగు మారింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన బృందావనాలకు వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే లక్షల రూపాయలు వెచ్చించి తమ పార్టీ రంగులను వేసిన విషయం తెలిసిందే. దీనిపై అప్పట్లోనే అభ్యంతరాలు వ్యక్తమైనప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లాలోని బృందావనాలకు మూడు రంగులను చెరిపేస్తూ తెల్ల రంగు వేశారు.

స్వర్ణాంధ్ర సాకారం కోసం బాబును మళ్లీ రప్పిద్దాం: ఆదిమూలం


చెరివిలో ప్రచారం నిర్వహిస్తున్న ఆదిమూలం

సత్యవేడు, ఏప్రిల్ 28: స్వర్ణాంధ్ర సాకారం కోసం చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిగా రప్పిద్దాం అని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే ఆదిమూలం పిలుపునిచ్చారు. ఆదివారం సత్యవేడు మండలంలోని చెరివి, రామచంద్రపురం, ఆరూరు, చెంగంబాకం, కొల్లడం, మాధనపాళెం, పెద్ద ఈటిపాకం, వానెల్లూరు, రాళ్ళకుప్పం గ్రామాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచుతూ ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు ముని సుబ్రహ్మణ్యం, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

తొట్టంబేడు, ఏప్రిల్ 28: తొట్టంబేడు మండలంలోని చిట్టత్తూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు పుట్టా మహేష్‌రెడ్డి తన అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. ఆదివారం శ్రీకాళహస్తి మండలం ఊరందూరులో సుధీర్‌రెడ్డిని కలిసిన మహేష్‌రెడ్డి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే శివనాథపురం, కొత్తకండ్రిగ గ్రామాల నుంచి అంకిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, గంగిరెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రామిరెడ్డి, ప్రభాకర్, గోపాల్, రాజమాణిక్యం, వెన్నెల, శరణ్య తదితరులు టీడీపీలో చేరారు. వారందిరిరీ సుధీర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వెంకటాచలం, శోభన్‌బాబు నాయుడు, కన్నలి ప్రవీణ్ రెడ్డి, బాలాజీరెడ్డి, మునిరాజనాయుడు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణకు స్వాగతం

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 28: బుచ్చినాయుడుకండ్రిగలో సినీహీరో బాలకృష్ణ టీడీపీ నాయకులు, అభిమానులు స్వాగతం పలికారు. ఆదివారం రాత్రి సూళ్లూరుపేట రోడ్డుషో ముగించుకుని రేణిగుంటకు వెళుతున్న బాలకృష్ణకు బుచ్చినాయుడుకండ్రిగలో టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, తిరుపతి పార్లమెంట్ కార్యదర్శి సముద్రాల సుధాకర్ నాయుడు నాయుకులు మధునాయుడు, అభిమానులు స్వాగతం పలికారు.

చెల్లూరులో రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

ఏర్పేడు, ఏప్రిల్ 28: ఏర్పేడు మండలం చెల్లూరు పంచాయతీలో రెండు కుటుంబాల మధ్య ఆదివారం సాయంత్రం ఘర్షణ జరిగింది. గ్రామానికి చెందిన ఈ వివాదంలో భక్తవత్సలం, లక్ష్మయ్య కుటుంబ సభ్యులు ఒకరినొకరు కొట్టుకున్నారు. భక్తవత్సలం, ఆయన భార్యమాధవి, కుమారుడు మునీశ్వర్, కుమార్తె భార్గవి చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చేరారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 28: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వేసవి సెలవులకు వారాంతపు రోజులు తోడు కావడంతో ఆదివారం ఉదయం నుంచి ఆలయంలో క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. సాయంత్రం రాహుకాలం సమయంలో రాహు-కేతు సర్ప దోష నివారణ పూజలు జరిపించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపారు. మొత్తం సుమారు 30వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు.

ఆగివున్న బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఏర్పేడు, ఏప్రిల్ 28: ఏర్పేడు మండలం సీతారాంపేట వద్ద రోడ్డు పక్కన ఆగివున్న బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో హోంగార్డు రామకృష్ణ గాయపడ్డాడు. అతడిని 108 వాహనంలో తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సీఐ శ్రీరామ శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారును ఢీకొన్న టిప్పర్

ఏర్పేడు, ఏప్రిల్ 28: ఏర్పేడు మండలం అంజిమేడు క్రాస్ వద్ద కారును టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు పాక్షికంగా దెబ్బతింది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

పుత్తూరు వార్తలు

రాష్ట్రాభివృద్ధికి ఎన్డీఏని గెలిపించుకోవాలి

పుత్తూరు టౌన్, ఏప్రిల్ 28: రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమ కోసం ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని జనసేన నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి మెరుపుల మహేష్ పిలుపునిచ్చారు. ఆదివారం పుత్తూరులో జరిగిన ఎన్డీఏ కూటమి ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరిలో రోజాను ఇంటికి పంపడానికి ఎన్డీఏ కూటమి నాయకులు కలసికట్టుగా పనిచేయాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ మాట్లాడుతూ వైసీపీ అరాచకాలకు అంతం పలకాలంటే ఎన్డీఏ కూటమిని గెలపించుకుని, చంద్రబాబును మళ్లీ సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చినబాబు, డీఎన్ ఎలుమలై, గాలి జీవరత్నం నాయుడు, రవికుమార్, ధనపాల్, షణ్ముగ రెడ్డి, మణిరెడ్డి, విక్కీ రాయల్, యుగంధర్, మణిరాజు, జనసేన నాయకులు సురేష్‌బాబు, నాగార్జున, కృష్ణయ్య, పేపర్ రమేష్‌బాబు, వెంకటముని తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలంలో నిర్మాణం

వడమాలపేట, ఏప్రిల్ 28: మండలంలోని సీతారామపురం వద్ద ఆక్రమిత స్థలంలో శనివారం రాత్రి నిర్మాణం చేపట్టారు. రోడ్డు పక్కన రూ.లక్షల విలువ చేసే ప్రభుత్వ భూమిని చదును చేశారు. స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పనులు ఆపేశారు. శనివారం రాత్రి ఏకంగా గోడలే కట్టేశారు. దీనిపై సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు స్థానికులు తెలిపారు.

టీడీపీతోనే ఎస్టీల అభ్యున్నతి

భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 28: ఎస్టీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని ఎన్‌డీఏ కూటమి నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ స్పష్టం చేశారు. ఆదివారం మాజీ ఎంపీపీ డీఎన్ ఏలుమలై(అమ్ములు) ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని కల్యాణపురం ఎస్టీ కాలనీకి చెందిన సుమారు 30 కుటుంబాలు గాలి భానుప్రకాష్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించిందని ధ్వజమెత్తారు. టీడీపీ కూటమి అధికారంలోకి రావడం వచ్చాక ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగేవిధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తామని చెప్పారు. మాజీ ఎంపీపీ ఏలుమలై (అమ్ములు) మాట్లాడుతూ నియోజకవర్గాన్ని లూటీ చేసిన రోజాను తరిమికొట్టేందుకే టీడీపీలో చేరానని స్పష్టం చేశారు. గత రెండు ఎన్నికల్లో రోజా గెలుపు కోసం పనిచేశానని, అధికారంలోకి వచ్చాక ఆమె చేసే అవినీతిని సహించలేక తొలి ఆరు నెలల్లోనే దూరం జరిగానని గుర్తు చేసుకున్నారు. ప్రజలందరూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి భానుప్రకాష్‌కు గెలిపించాలని పిలుపునిచ్చారు.


టీడీపీలో చేరిన కల్యాణపురం ఎస్టీ కాలనీ వాసులతో భానుప్రకాష్

వడమాలపేట: మండలంలోని కల్లూరు, టీసీ అగ్రహారం, లక్ష్మమ్మకండ్రిగ, తట్నేరి, పాదిరేడు కాయంపేట గ్రామాల్లో ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ ప్రచారం నిర్వహించారు. ధనంజయులు నాయుడు, వెంకటయ్య, ఉమాపతిరావ్, భాస్కర్‌నాయుడు, మోహన్, అంజయ్య, ఉదయ్ యాదవ్, మురళి, అయ్యప్ప, హేమాద్రి నాయుడు, దాముయాదవ్, పూల గణపతి, శుభచంద్ర, చందు, రవిరెడ్డి, దాము, ముదిరాజ్, హేమావతి, లక్ష్మీప్రసన్న, మణిరాజు, పెద్దబ్బరాజు, లలితమ్మ, రామూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.


టీడీపీని గెలిపించాలని తీర్మానిస్తున్న భీముని చెరువు గ్రామస్తులు

అరాచక ప్రభుత్వాన్ని ఇంటికి పంపుదాం

నారాయణవనం, ఏప్రిల్ 28: అరాచకం, దౌర్జన్యాలకు మారుపేరుగా మారిన వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం నారాయణవనంలోని 3 వార్డులో తెలుగు జిల్లా రైతు కార్యదర్శి రవి ఆధ్వర్యంలో బాబును మళ్లీ రప్పిద్దాం కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అలాగే భీముని చెరువు గ్రామానికి చెందిన పెద్దలు, యువత కలిసికట్టుగా పనిచేసి సత్యవేడు ఎన్డీఏ కూటమి అభ్యర్థి ఆదిమూలంను గెలిపించుకోవాలని తీర్మానించారు. కార్యక్రమంలో గోవింద స్వామి, యువరాజ్, మురుగేష్ రెడ్డి, సురేష్, మాణిక్యం రెడ్డి, ఊరప్పన్, రజని, శేఖర్, కేశవుల రెడ్డి, మధి, ఆనంద్‌రావు, కన్నన్ తదితరులు పాల్గొన్నారు.